శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీకీ జై!!



సద్గురుం తం నమామి

# గురుకృప

శ్రీరామనవమి సంచిక



**బాబాపథంలో గమ్యం మాత్రమే కాదు, మార్గమూ ముఖ్యమైనది!**

గురువుగారు : బాబాపథంలో నడవడం అనేటువంటిది గమ్యం. నడుస్తూ ఉండటం. నిజంగా నడుస్తున్నామా? నడుస్తున్నామని అనుకుంటున్నామా? ఇంకా ఎంత బాగా నడవొచ్చు? మామూలుగా నడవడం కాదు. కొంచెం క్యాట్‌వాక్ చేస్తామా? దాంట్లో పురోగతి చేసుకుంటూ పొండి. నడవడం అంటే ఊరికే నడవడం కాదు కదా, కుంటుతూ నడుస్తున్నామా? గెంతుతూ నడుస్తున్నామా? ఎట్లా నడుస్తున్నాము? అట్లా చక్కగా నడవడానికి ప్రయత్నం చెయ్యండి. అదే గమ్యం. గమ్యమంటే వేరే ఏమీ ఉండదు. నేను ఎప్పుడూ మీ అందరికీ చెప్పేదొకటే. means itself is a goal. ఎక్కడో ఆనందం వస్తుంది. అని మనం ఇప్పుడు కష్టాలు పడుతున్నామా? ఎప్పుడో వచ్చేది కాదు. ఇప్పుడే మనం ఆనందంగా ఉండాలి. Suffering through suffering. Happiness అనేది కాదు. Happiness through happiness. కాబట్టి మీన్స్‌ని ఎక్కువ ఇది చేసుకోవాలి. ఇప్పుడు ఎట్లాగైనా ఉండనీ. మనం అనేది కరెక్ట్ కాదు. మీన్సే ఇంపార్టెంట్.

సంపుటి : 26
సంచిక : 2



శ్రీరామనవమి సంచిక
30 మార్చి 2023

గురుకృప



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి!
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీబాబూజీ

## లోపలి పేజీలలో

పథగామి 4
- గురుకృప

గురువు - సద్గ్రంథం - శాస్త్రం 6
- సమ్మోహనం

ఆహారం - వేళలు 9
- శ్రీమోపిదేవి కృష్ణస్వామి

మనం బాబాను ఏదైనా అడిగేటప్పుడు ఎలా అడగాలి? 15
- శ్రీబాబూజీ



17 సంత్ రబియా "ప్రభు భక్తి"
- యుగనిర్మాణ యోజన.

19 నాన్నగారి సమకాలీనమైన ఆధ్యాత్మికత
- సాయినాథుని శృతి

21 గురుకృపే తొలి అడుగు
- గట్టా రత్తయ్య

25 గురుకృపాలహరి
- గురుకృప

నిర్వహణ : గురూజి ఆశీస్సులతో - గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Web : www.gurukrupa.info



# పథగామి

**కొన్ని ప్రశ్నలు :** మిమ్ములను సూటిగా కొన్ని ప్రశ్నలడుగుదును. సమాధానము మీకు మీరే చెప్పుకొనుడు. నాకు చెప్పనవసరం లేదు. నా ప్రశ్నలు సాధకులకు మాత్రమే. ఎవరి ఆన్సర్ షీట్స్ వారే వాల్యుయేషన్ చేసుకోండి. ఇక్కడ ఆత్మవంచన, పరవంచన అన్న ఆలోచన లేకుంటే మనల్ని మనం ఎవల్యూట్ చేసుకోగలం. అట్టి భావన ఉన్న వారికే సద్గురువు యాక్టివ్ మిర్రర్‌లాంటి వారు. అప్పుడే మనలో ఎవల్యూషన్ కలుగుతుంది.

1. నీ యందు ధర్మానుష్ఠాన బుద్ధి ఉన్నదా?
2. అవసర సమయంనందు కూడా అధర్మము ప్రోత్సహించబడదా?
3. గురువునందు, దైవమునందు ఎప్పుడైనా సందేహము వచ్చునా?
4. నీవు పరనింద చేయుదువా? చేయవా?
5. అసత్య భాషణమునకు జంకుదువా? జంకవా?
6. సంవత్సరమున అసహనము ఎన్నిసార్లు కలుగును?
7. మనస్సునకు స్థిరము ఏర్పడినదా? లేక చంచలత్వమున్నదా?
8. పనులయందు శ్రద్ధ, భక్తి యున్నదా? లేక అశ్రద్ధ, నిర్లక్ష్యము ఉన్నదా?
9. నీవు శరీర శ్రమకు సిద్ధమేనా?
10. నీకు దైవమన్న భయమా?

**నిరంతర, నిత్య నియమాలతోనే సత్య దర్శనం :** మనం ఆధ్యాత్మికంగా రకరకాల సాధనలు చేస్తుంటాము. మన సాధనను నిర్వీర్యం చేసేందుకు మన యొక్క వాసనలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంటాయి. అందుకే సాధకులు నియమపాలన పెట్టుకుంటారు. అది కూడా నిరంతర నియమపాలన అవలంబిస్తారు. అలా నియమపాలన నిరంతరంగా లేకుంటే సాధన ఎప్పటికప్పుడు వెనుకడుగు పడిపోతూనే ఉంటుంది.

**సత్యాన్ని అంటిపెట్టుకో :** సత్యాన్ని తెలుసుకోవాలి. అయితే ఆ సత్యమును అనుభవంలోకి తెచ్చుకోవాలంటే (అనుభవించాలంటే) ధర్మం, సద్గురు సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవను (సద్గురువు చెప్పినట్లు చేయడం, ఉండమన్నట్లు ఉండటం, వారు నడిచి చూపిన బాటన నడవడమే నిజమైన సేవ) నిత్య నియమపాలనతో ఆచరిస్తేనే సాధ్యమవుతుంది. అయితే ఈ నిరంతర నియమపాలన సాధకుల విషయంలో మాత్రమే ఉండాలా? అనుకుంటే పొరపాటే!



మహాత్ములైన వాళ్ళు కూడా తమ నియమపాలన యావజ్జీవ పర్యంతమూ నిత్యం ఆచరిస్తుండటం ఆశ్చర్యకరం! మహాత్ముల నియమపాలనతో కూడిన ఆచరణే మనందరికీ ఆచరణాత్మక బోధ! సాధారణంగా మనం ఏమైనా నియమాలు పెట్టుకొని ఆధ్యాత్మిక జీవనం సాగిస్తున్నపుడు అనారోగ్యం సంభవించినపుడుగాని, మరే ఇతర ఇబ్బందులు ఎదురైనపుడుగానీ అప్పటివరకు మనం పాటిస్తున్న నియమాలకు సడలింపులు ఇచ్చుకుంటుంటాము. పైగా భగవంతునికి తెలియదా మన ఇబ్బందులు? ఆయనేమీ ఇబ్బంది పడుతూ సాధన చేయమన్నాడా? అనే ప్రశ్నలు మనకు మనం వేసుకుంటూ ఇతరుల దగ్గర మనం చేసే పని సరియైనదన్నట్లు మాట్లాడుతుంటాము.

ఒక పర్యాయం నడిచే దేవునిగా పేరుగాంచిన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామివారికి జ్వరతీవ్రత ఎంతో అధికంగా ఉన్నది. అట్టి పరిస్థితులలో కూడా తమ అనుష్ఠానానికి విఘాతం కలుగకుండా నదిలో అనేకమార్లు తల ముంచుతూ స్నానం చేస్తారు. మరి వారు మనకంటే ఎంతో అధికులు కదా! మరి తమ నియమాలను సడలించుకోవచ్చు కదా. అంత జ్వరతీవ్రతలో అలా స్నానమాచరిస్తే ప్రాణం నిలుస్తుందా? అదే మనమైతే, ప్రాణమే లేకుంటే, సాధన చేసేదెలా? అందుకనైనా నియమాలను సడలించుకోవాల్సిందే అన్నట్లుంటాము. (సత్సంగ నిర్వహణలో శ్రీ బాబూజీ దృక్పథం, కాకా మహాజని వృత్తాంతం , బాబా భిక్ష చేసిన ఇంటి పిల్లవాడి వృత్తాంతం, నూల్కర్ వృత్తాంతం). ఒకసారి శ్రీస్వామివారి బృందం రైల్లో మద్రాసు రాష్ట్రంలోని రాజపద్మాపురం వెళ్తున్నారు. ప్రయాణ తొందరలో శ్రీస్వామివారు గంజి త్రాగే తాటాకు రేక వెంట తీసుకుపోవడం సేవకులు మరచిపోయారు. రైల్లో శ్రీస్వామివారిని గంజి త్రాగమంటే, శ్రీస్వామివారు తాటాకు రేక అడిగారు. కానీ రేక లేదు. రేక లేకుంటే గంజి వద్దు అన్నారు శ్రీస్వామివారు. అట్లాగే రెండు రోజులు గడిపారు ఆహారం ఏమీ తీసుకోకుండా. ఈ రెండు రోజులూ సేవకులంతా చక్కగా భోంచేస్తున్నారు. శ్రీస్వామివారు మాత్రం నిరాహారిగానే యున్నారు. మూడవరోజు కూడా రేక లేదు గనుక గంజి స్వీకరించలేదు శ్రీస్వామివారు. అపుడు బృందమంతా ఎలాగో కష్టపడి ఒకచోట తాటాకు పట్టుకొచ్చి, రేక కట్టి ఇస్తే గంజి త్రాగారు శ్రీస్వామివారు. రెండు రోజులకు పైన నిరాహారిగా ఉంటే ప్రాణహాని అవుతుందనే భయమే లేదు శ్రీస్వామివారికి. నిత్య నిరంతర నియమపాలన అంటే ఇలా ఉంటుంది. ప్రాణం పోతుందన్నా కూడా నియమాలకు సడలింపు ఇవ్వకపోవడమే అసలైన సాధన. అలాంటి నియమపాలన లేనిదే ఆధ్యాత్మిక సాధనలో ఈషణ్మాత్రమైనా ప్రయోజనము లేదని శ్రీస్వామివారు మనందరికీ స్పష్టం చేస్తున్నారు. ఒకరోజు శ్రీస్వామివారు తలుపూరులో



పెమ్మసాని మస్తానయ్యగారి వేపచెట్టు క్రింద విడిది చేసియున్నారు. ఉన్నట్లుండి కుండపోతగా వర్షం కురవసాగింది. సేవకులంతా సామానుతో సహా మస్తానయ్యగారింట్లోకి వెళ్ళారు. శ్రీస్వామివారు మాత్రం బయట తడిసిపోతూ వర్షంలో అట్లే ఉన్నారే గాని, వారింటివైపు కూడా చూడలేదు. శ్రీస్వామివారు ఎవరింటి లోపలకు రారు కాబట్టి కనీసం ఇంటి గడపలోనైనా కూర్చుని కాళ్ళు బయట పెట్టుకోమని సేవకులు ఎంత చెప్పినా శ్రీస్వామివారు ససేమిరా రానంటారు. ఇప్పటిలా ఆ ఇంటికి వరండా లేదు. శ్రీస్వామివారి శరీరమంతా తడిచి బురదమట్టితో నిండిపోయింది. శ్రీస్వామివారు గజగజ వణుకుతున్నారు. అయినా ఇంటివాకిట కూర్చునేందుకు కూడా సుముఖత చూపలేదు. అపుడు సేవకులు ఒక తాటాకు గొడుగు తీసుకువచ్చి స్వామివారి పైన పెట్టి వర్షానికి తడవకుండా చేసారు. నిత్య నియమపాలన అంటే ఎలా ఉండాలో సాధకులకు ఆచరణతో వెల్లడిస్తున్నారు శ్రీస్వామివారు. పంచభూతాలను అదుపు చేయగల్గిన శ్రీస్వామివారు వర్షం ఆపవచ్చు గదా అనే సందేహం కలుగవచ్చు. సామానుతో పాటు సేవకులు క్షేమంగా మస్తానయ్యగారింట్లోకి చేరి ఉన్నారు. ఇక వర్షం ఎవరికొరకు ఆపాలి? ఒక్క తన కొరకు మాత్రమే కదా! తన ఒక్కని కొరకు ప్రకృతి సిద్ధంగా జరిగే సృష్టి క్రమాన్ని ఆపడం శ్రీస్వామివారి ధర్మనిర్ణయానికి సరిపోదు కనుక వర్షాన్ని అలానే కురవనిచ్చారు. **'గురుపదాలు' నిత్యజీవితపు ఊట. చల్లని వెలుగుల బాట. మన(సు)లను రక్షించే కోట. ఆత్మీయమైన ప్రసాదం. దివ్యమైన ఆహారం.**

**– *గురుకృప***

## గురువు - సద్గ్రంథం - శాస్త్రం

ప్రపంచంలో ఏ వస్తువైనా, ఏ శాస్త్రమైనా సక్రమమైన రీతిలో వినియోగించుకోవడం తెలిసినవాడికి ఉపకరిస్తుంది. ఆయా శాస్త్ర విజ్ఞానముల యందు ఏ మాత్రమూ కృషి చేయకుండా, అసలు ప్రవేశమే లేకుండా ప్రవీణుల వలే సిద్ధాంతీకరించడం ఈ మధ్యకాలంలో బాగా ఎక్కువైంది. అంతేకాదు, సిద్ధాంతాలను ప్రజలపై రుద్దడాన్ని శాస్త్రీయ దృక్పథం అని ప్రచారం చేస్తున్నారు. తమ సిద్ధాంతాలను నమ్మని వారిది మూఢాచారం అంటున్నారు. అసలు ఆయా శాస్త్ర విషయాల యందు వారికి అక్షరాభ్యాసం కూడా కాకుండానే ఈ రాద్ధాంతమంతా! ఇంకొందరు ఆయా శాస్త్రాల పరమార్థం, వాటిని సరియైన రీతిలో వినియోగించుకునే నైపుణ్యం తెలియని స్థితిలో తల్లక్రిందులవుతున్నారు. ఇరవై సంవత్సరాలు అహోరాత్రాలు కృషి చేస్తే ఒక శాస్త్రంలోకి ప్రవేశం కలుగుతుందని మాస్టర్ ఇ.కె.గారు చెప్పేవారు. ఇక ప్రావీణ్యం గడించాలంటే, జీవితాన్ని సమర్పణ చేయాల్సి



ఉంటుందన్నమాట. అంతటి అకుంఠిత దీక్ష నేడేది? ఒకసారి గురువుగారితో కలిసి నేను (ఇ.కె.గారు) కారంపూడిలో డా॥వసంతరావుగారింట్లోకి వెళ్ళాను. అప్పుడు వారి భార్య గురువుగారినిలా అడిగింది "గురువుగారూ! మా ఇంట్లో దేవుడిని ఏవైపు పెట్టమంటారు?". ఉన్న నాలుగు దిక్కులలో ఏది చెబుతారా! అని నేను ఆసక్తిగా చూస్తున్నాను. గురువుగారు ఠక్కున ఇలా అన్నారు. **"అమ్మా! దేవుడు అన్నివైపులా ఉంటాడు. కావలసిందల్లా మనం దేవుడి వైపు తిరిగి ఉండటం, మనం దేవుని యెడల దైవకార్యాల యెడల అభిముఖులమై ఉండాలి. అంటే అందరిలో, అన్నివైపులా ఉండే దేవునికి ఉపకరించే పనులు చేయాలి".** గురువుగారి ఈ వాక్యాలు నాలో వెలుగు రేఖలను విరజిమ్మాయి. సూటిగా చూస్తే సత్యం అంతే! దీనికోసం గందరగోళపడే కుటుంబాలెన్ని లేవు! దైవము, దయ్యము అనేవి ప్రకృతి, వికృతి శబ్దాలని చిన్నప్పుడు చదివిన గుర్తు. వికృతరూపం అని మనం అనుకునేది కూడా, ప్రకృతి యొక్క ఒకానొకరూపం. అది గ్రహించి **వికృతరూపం నుంచి సవరించి ప్రకృత రూపాన్ని తిరిగి అనుగ్రహించగలిగేవాడు అప్రాకృతమూర్తి గదా! వారే గురువు కదా!**

**గురి-విశ్వాసము-రక్షణ: "గురే-గురువు"**. దానికి 'గురుతు' ఒక్కొక్కరికి ఒక్కోరూపంలో దర్శనమిస్తుంది. అలాగే విశ్వాసం అనేది బయట కొనుక్కోవడానికి దొరికే వస్తువు కాదు. అది లభించాలంటే **"గురి"** కుదరాలి. గురువుగారి యెడల గురి కలిగి, తద్వారా విశ్వాసం పెంపొందినందువలన పొందిన రక్షణను అనుభవించగలము. అమృతముగానున్నది నూటికి డెబ్బది ఐదుపాళ్ళు కాగా, వ్యక్తమైనది కేవలం ఇరువది ఐదు శాతము మాత్రమే. వ్యక్తమైన యావత్తునూ ఎరిగిన వారెవరు? అవ్యక్తమైన దాని నెరిగిన వారే, వ్యక్తమైన దాని ఎరుక గలవారు. అలాకాక నాకు మొత్తం తెలుసునని చెప్పుకునేవారు కేవలం అవ్యక్తులు. సమస్తసృష్టి పరమాత్మలో పావలా వంతైతే! మనకు తెలిసిందెంత? మనమెంత? "గురువుగారి దర్శనం కాక పూర్వం మనకన్నీ తెలుసు అనే భావం ఉండేది. కానీ గురువుగారి దర్శనమైన తర్వాత దాని స్థానంలో మనకేమీ తెలియదనేది గట్టిగా తెలిసింది. ఆ తర్వాత నుంచి భర్తృహరిగారు వ్రాసిన పద్యాన్ని నేనిలా చదువుకుంటున్నాను.

తెలివి యొకింత లేనియెడ దృప్తుడనై కరిభంగి సర్వమున్
తెలిసితినంచు గర్వితమతిన్ విహరించితి దొల్లియిపుడు
జ్వలమతులైన పండితుల సన్నిధి నించుక బోధశాలినై
తెలియనివాడనై మెలగితిన్ గతమయ్యెనితాంతగర్వమున్



మనం తప్పుమార్గంలో పడకుండా ఉండేందుకై మహనీయులు ఒకోసారి తప్పులు తమపై వేసుకొని ఇలా చమత్కారం చూపుతారు. **('సాయినాథుని శరత్‌బాబూజీ సత్సంగం' అని తెనాలిలో పేరుపెట్టిన సందర్భ వృత్తాంతం).** మహనీయులు తమ కరుణను వివిధ రూపాలలో వ్యక్తీకరిస్తారు. అది చూపుకావచ్చు, స్పర్శకావచ్చు, సంభాషణ కావచ్చు, ఇంకా ఇంకా ఏమైనా కావచ్చు. తన వద్దకు ఆర్తులై, అర్థార్థులై, జిజ్ఞాసువులై వచ్చెడి అనేకానేక వ్యక్తులకు వారి ఆర్తిబాపి, జ్ఞానమును గూర్చే కల్పతరువు గురుదేవులు.

**శుభప్రదాత :** మనకేది క్షేమమో, ఏది శుభమో, మనం దేన్ని కోరితే మనకు మంచిదో తెలియక మనం ఇబ్బందుల పాలవుతుంటాము. (అడగడం, నేర్పడం–సాయిపథం). ఆ భారం మోసేవాడి మీద వేస్తే జరిగేదంతా శుభమే! **ప్రమాదంలో పడబోయి ప్రమోదంలో పడ్డవారి కథలు** ఎన్నో వారి చెంతన.

**జ్వరం పుల్ల : "మీ మాటలు మంత్రంబులు"** అని ప్రవరుడు సిద్ధుణ్ణి కీర్తించాడని పుస్తకాలలో చదువుకున్నాము. **గురుస్మరణయే** ఊపిరిగా జీవితం గడిపిన వారిని చూసిన తర్వాత, వారి మాటలు విన్న తర్వాత అది **మంత్రమని** అనుభవంలో తెలిసింది. ఎవరైనా థర్మామీటరుతో జ్వరం చూస్తున్నా, లేక వారి దగ్గరకు వచ్చి ఎవరైనా ఇంత జ్వరం ఉందని చెప్పినా వారు ఇలా అనేవారు. "అది జ్వరంపుల్ల (థర్మామీటర్) దాని గుండానే జ్వరం వస్తుంది. మీరు **జ్వరాన్ని కొలవకండి. (ఎంత జ్వరం ఉందో థర్మామీటర్‌తో లెక్కించడం మానుకోమని ఒక భావం. జ్వరాన్ని కొలవకండి అంటే, జ్వరంపై ధ్యాస ఉంచకండి అని హెచ్చరిక). గురువుగారిని కొలవండి" అనేవారు. "రోగధ్యానం చేయకండి, దైవధ్యానం చేయండి".** అప్పుడు రోగం అన్న స్థితి ఉండదు. దైవం అన్న స్థితి మనలో, మనం దైవస్థితిలో ఉంటాము" అని. **(నూల్కర్ వృత్తాంతం, కాకా మహాజని వృత్తాంతం)**

వారు తరచూ చెబుతుండేవారు "కొందరు పక్కవాడికి ఏ బాధ వచ్చినా, తనకు కూడా ఆ బాధ ఉందని, లేదా రాకుండా ఉండాలని ఊహించుకుంటారు". ఇంకొందరు గురువుగారి దగ్గరకు వచ్చి స్వస్థులైనప్పటికీ వారితో ఇలా అనేవారు "మీ దయవల్ల నా బాధలు తగ్గిపోయినా. ఎందుకైనా మంచిది, మీ చేత్తో కాస్త ఊది పెట్టండి. మళ్ళా రాకుండా ఉంటుంది" అన్న వారితో వారు ఇలా అనేవారు **"బాబుగారూ, మీ బాధలు తగ్గింది బాబాగారి వల్ల! మీరిక ఆ బాధలను ఆహ్వాన సంఘం వేసి పిలవకండి. పోయిన బాధలను గురించి చింతించకండి. గురువుగారు మీ బాధలను ఎందుకు తొలగించారు? దానికి మీరేం చేయాలి? అని ఆలోచించండి.** (గురువుగారు మీ బాధలను తొలగించిన



రీతిలో మీరు మీ సాటి వారి బాధలు తొలగి, వారు బాగుండేలా ప్రార్థన చేయండి, సాధన చేయండి, కృషి చేయండి).

ఎపుడును ఇతరుల బాధలకు।
తపనంబడి జాలినొంది తగరక్షింపన్।
తపముం చేయగవలయును।
ఉపకారము చేయుకొరకె ఉండగవలయున్ ॥

ఇవి తెలుగులో చెప్పిన మహామంత్రాలు. మన జీవితాలు గురుస్మరణతో మంత్రపూరితాలై వెలుగులు విరజిమ్ముగాక।

– సమ్మోహనం

## ఆహారం - వేళలు

ఆహార స్వీకరణకు వేళలను పాటించాలి. అందరకూ ఒకే వేళలు సాధ్యపడకపోవచ్చు. మన వృత్తి వ్యాపారాలను బట్టి దినచర్య నడిచే తీరునుబట్టి –ఇవీ రోజులో మనం ఆహారాన్ని స్వీకరించే వేళలు అవి నిర్ణయించుకోవాలి. ఒకసారి నిర్ణయించుకున్న తరువాత ఇక ఆ వేళలకు కట్టుబడాలి. రోజూ ఆ వేళలకు మనం ఆహారాన్ని స్వీకరిస్తున్నపుడే ఆ వేళలు అయ్యేటప్పటికీ మనకు ఆకలి వేస్తుంది. ఆకలి వేయడమంటే ఏమిటి? 'సమయమైంది. ఇక ఆహారాన్ని స్వీకరించవచ్చును' అని కడుపులో అలారం మ్రోగుతున్నదన్నమాట! అప్పుడు మనం ఆ అలారంను పట్టించుకోవాలి. వెంటనే ఆహారాన్ని స్వీకరించాలి. అలాకాక, అవుతున్న ఆకలిని లక్ష్యపెట్టక మనం కాలయాపన చేసామనుకోండి. ఆకలి వేసి వేసి ఆగిపోతుంది. ఆకలి చచ్చిపోతుంది. ఆ తరువాత మనం ఆహారం స్వీకరిస్తే, అది మన శరీరానికి బరువవుతుందే తప్ప పోషణ కాదు. పోషకాహారాన్ని గురించి చర్చలు జరుగుతున్నంతగా, ఆహారం స్వీకరించడానికి కాలనియమం పాటించాలి అన్న అంశం మీద తగినంత శ్రద్ధ పెట్టబడటం లేదు. వేళలు పాటించబడనపుడు ఏదో ఒక వేళకు మనం తిన్నాము అని అనిపిస్తున్నపుడు ఆ తీసుకున్నవి ఎంతటి విలువైన సపోషక పదార్థాలను కలిగి వున్నా, మనకు ఒరిగేది అంతంత మాత్రమే.. సంస్కృతంలో ఒక సూక్తి ఉన్నది 'శతం విహాయభోక్తవ్యం'. వందమందిని విడిచిపెట్టయినా నీ వేళకు నీవు భోజనం చేయి అని దీనికర్థం. భోజనం వేళకు నీ చుట్టూ ఉన్న వాళ్ళను 'రండి భోంచేద్దాం' అని పిలువు! వారు వస్తే సంతోషమే! ఒకవేళ వారు రాకపోతే నీ భోజనం నీవు చేసేయి. శరీరం నిలబడటం, శరీరం యొక్క స్వస్థత నిలబడటం,



ఆహార స్వీకరణకు వేళలను పాటించబడటం మీద ఆధారపడినంతగా ఇంక దేని మీదా ఆధారపడి లేదు. వేళ తప్పాము, వ్యాధి వచ్చింది, మందు పుచ్చుకున్నాం, వ్యాధి తగ్గింది. మళ్ళీ వేళ తప్పుతూనే ఉన్నాం. మళ్ళీ వ్యాధి వస్తూనే ఉంది. మళ్ళీ మందు పుచ్చుకుంటూనే ఉన్నాం. ఇక్కడ అసలువ్యాధి "వేళ తప్పడం" అనేది. దానిని సరిచేసుకోకుండా ఎన్ని మందులు పుచ్చుకొని ఏం లాభం! దినచర్యను దిద్దుకోని వాడికి ఔషధాల వలన ఒనగూడే ఉ పయోగం అంతంత మాత్రమే.

## పగలు - రాత్రి

పగటిపూట బరువైన ఆహార పదార్థాలు తీసుకున్నా ఇబ్బంది లేదు. శరీరం పనిలో ఉంటుంది కనుక ఆ పదార్థాలు సజావుగా అరిగిపోతాయి. రాత్రిపూట తేలికగా అరిగే పదార్థాలను తీసికోవడం మంచిది. పగటిపూట తీసుకున్నంత ఆహారం నిజానికి రాత్రిపూట మనం తీసుకోలేము. రాత్రి పూట స్వీకరించే ఆహారం యొక్క పరిమాణం తగ్గుతుంది. ఇది సహజం. అభ్యాసవశంచేత పగటి మాదిరిగానే రాత్రిపూట కూడా స్వీకరించే ప్రమాదం ఉంది. దీనికి మనం లోనుకాకూడదు.

## ఆహారం - కాలాలు

మనం గమనించినట్లయితే శీతాకాలం మనం ఘనాహారాన్ని ఎక్కువ తీసుకుంటూ ఉంటాం. కారణం శరీరం లోపల వేడిని పుట్టించవలసిన అవసరం ఎక్కువగా ఉంటుంది. దానికి కావలసిన ఇంధనం కావాలి కనుక! వేసవికాలం ద్రవాహారాన్ని ఎక్కువగా తీసుకుంటూ ఉంటాం. కారణం చెమటలు పోయవలసిన అవసరం ఉన్నది. అందుకుగాను జలధాతువు ఎక్కువ శరీరానికి కావలసి ఉన్నది కనుక! ఇలా కాలంలో వస్తున్న ఈ మార్పులను గమనించుకోవాలి. గమనించుకోకుండా, ఒకే మాదిరిగా తినేస్తున్నామనుకోండి! త్రాగేస్తున్నామనుకోండి. ఇబ్బంది పడతాం, వ్యాధి బాధలకు గురి అవుతాం.

## ఆహారం- వయస్సు

నడుస్తున్న కాలాన్ని గమనిస్తున్నట్లే, జీవన కాలాన్ని అనగా వయస్సును కూడా ఆహార స్వీకరణ విషయంలో పట్టించుకోవాలి. నడివయస్సు వరకు ఏ పదార్థాలయితే మనకు తేలికగా అరుగుతాయో నడివయస్సు తరువాత ఆ పదార్థాలే మనకు అంత తేలికగా అరగని స్థితి ఏర్పడేటందుకు అవకాశముంది. కనుక ఇది వరకు తిన్నాం కదా! అలాగే ఇప్పుడూ తినేద్దాం అని విజృంభించడం మంచిది కాదు. నడివయస్సు దాటిన తర్వాత బరువైన ఆహార పదార్థాలను తగ్గించడం మంచిది.



అంటే దుంపలూ మొదలైన వన్న మాట. అలాగే వరి అన్నానికి బదులుగా కొంత గోధుమను తీసుకోవడం అలవాటు చేసుకోవాలి. నడివయస్సు దాటిన తరువాత తీసుకునే ఆహారంలో అదివరకటిమీద పరిమాణం తగ్గాలి. అరుగుదలకు ఇబ్బందయినవి తగ్గాలి. తీసుకునే ఆహారం యొక్క పోషక విలువలు పెరగాలి. ఇలా మనం జాగ్రత్తపడినట్లయితే స్వస్థత చిరకాలం నిలబడుతుంది. మంచాన పడవలసిన అవసరం రాదు. ఇక్కడ ఇంకొక సూక్ష్మాన్ని కూడా గమనించుకోవాలి. నడివయస్సు వరకూ మనకు శక్తినిచ్చిన ఆహారం, నడివయస్సు దాటిన తరువాత అంతటి శక్తిని అందించలేదు. అంటే ఆహారం నుండి శరీరం ఇదివరకటి స్థాయిలో శక్తిని అందుకోలేకపోతున్నది అని మనం గ్రహించుకోగలగాలి.

ఔషధం విషయంలో కూడా అంతే! నడివయస్సు వరకు ఔషధాలు పట్టిచ్చినంతగా నడివయస్సు తరువాత పట్టివ్వవు. ఔషధ ప్రభావంలో చెప్పుకోదగిన తేడా కనబడుతుంది. నడివయస్సు వరకు మనం కొండ ఎక్కుతున్నాము. నడివయస్సు నుండి మనం కొండ దిగుతున్నాం. కొండ ఎక్కుతున్నప్పటి స్థితి కొండ దిగుతున్నపుడు ఉండదు. అలవాటు చొప్పున అన్ని వయస్సులలోను ఒకేలాగున భోజనం చేస్తేనే వ్యాధి బాధలకు కూడా మనం అలవాటు పడిపోవలసి వస్తుంది. కాలాన్ని అన్ని విధాలా గమనించుకోవడం అన్నది చాలా అవసరం.

## వత్తిడి ప్రభావం

మనస్సు వత్తిడిని అనుభవిస్తున్నపుడు ఆహారాన్ని స్వీకరించడం మంచిది కాదు. ఆఫీసుకు వేళ దాటుతోందనో, రైలుకు సమయం మించి పోతోందనో మనస్సు వత్తిడిని అనుభవిస్తోంది అనుకోండి. అప్పుడు తగు మాత్రంగా మజ్జిగలాంటి ద్రవాహారాన్ని స్వీకరించి బయలుదేరిపోవడం మంచిది. వత్తిడిననుభవిస్తూ, మాటిమాటికీ గడియారాన్ని చూసుకుంటూ, తింటున్నదేమిటో తెలియని స్థితిలో భోజనాన్ని ముగించడం మంచిది కాదు. అలాంటి సమయంలో జీర్ణకోశంలాంటి దేహభాగాలు కూడని క్షోభకు గురి అవుతాయి. ఆ క్షోభ ఫలితాలు తరువాత చాలా కాలం వరకు మనను వెన్నాడుతాయి. ఆధునిక యుగంలో వేళలు పాటించక పోవడం ఒకటి, మనస్సు వత్తిడికి గురి అవుతూ ఉండగా ఆహారం స్వీకరించడం ఒకటి. ఈ రెండు అంశాలూ మనని తీరని వ్యాధిబాధలకు గురి అయ్యేటట్లు చేస్తున్నాయి. కనుక మనం జాగ్రత్త పడాలి.

## బాధ - విషాదం

మనస్సు బాధను అనుభవిస్తున్నపుడు, విషాదాన్నీ, దుఃఖాన్నీ అనుభవిస్తున్నపుడు భోజనం చేయడం



మంచిది కాదు. మనం కొంచెం గమనించగలిగితే అసలలాంటి సమయాలలో ఆకలి అంతగా ఉండదు. అసలే ఉండకపోవచ్చు కూడా! అంటే అర్థమేమిటి? "ఈ పూటకు భోజనం విరమించండి". అని జీర్ణాశయం సూచిస్తున్నదన్నమాట. అలాంటపుడు ఏ ద్రవాహారమో, తగుమాత్రంగా తీసికొని ఉండిపోవడం మంచిది. అలాకాక, అలాంటి సమయాలలో ఆకలి కాకపోయినా, బలవంతాన భోజనం చేసామనుకోండి. తరువాత మనం విషమ ఫలితాలకు గురి కావలసి రావచ్చు.

## వంట - భోజనం

వంటగది, భోజనాల గది ప్రక్క ప్రక్కనే వేరు వేరుగా ఉండటం మంచిది. అలా సాధ్యపడకపోతే వంటకూ, భోజనానికీ కనీసం ఒక గదిని కేటాయించుకోవడం మంచిది. పల్లెటూళ్లలో వంట చేయడానికి వేరే ఇళ్ళు ఉంటాయి. అది ఇంకా శ్రేష్ఠం! ఏతావాతా చెప్పవచ్చేది ఏమిటి అంటే వంట, భోజనాలు ఒక ప్రత్యేక ప్రాంతానికి పరిమితం కావాలి. వండబడిన పదార్థాలు ఇంటిలోని మిగిలిన గదులలోనికి ప్రయాణం చేయకూడదు. కొంతమంది బద్ధకించి తామున్న చోటికే ఆహారపదార్థాలను రప్పించుకొంటారు. మంచాల మీద కూర్చుని, కంచాలను ఒళ్ళో పెట్టుకొని మరీ తింటూ ఉంటారు. ఇది మంచి పద్ధతి కాదు. దీనివలన వండబడిన పదార్థాల అవశేషాలు మిగిలిన గదులలో పడే అవకాశాలున్నాయి. వాటిని మనం విడిచిపెట్టినా క్రిమికీటకాలు విడిచిపెట్టవు. కాబట్టి వంట పదార్థాలు, భోజన పదార్థాలూ ప్రత్యేకంగా ఒక గదికి పరిమితం కావడం అవసరమన్నారు మన పెద్దలు.

## తలపుల ప్రభావం

వంట చేస్తున్నంతసేపూ మనస్సు మంచి భావనలతో ఉండాలి. మనస్సును చెడు తలపులు ముసురుతూ ఉండగా వంట చేయడమంటే విషాన్ని తయారు చేయడమే! ఇరుగింటి పొరుగింటి వాళ్ళతో పోట్లాడుతూ వంట చేయకూడదు. ఇంట్లో వాళ్ళతో ఘర్షణ పడుతూ వంట చేయకూడదు. మనలో మనం కూడని తలపులతో వంట చేయకూడదు. మీరు ఏ ఆలోచనలతో వంట చేస్తే, తినేవారికి ఆ తలపులు వస్తాయి. మీరు పోట్లాడుతూ వంట చేస్తే, ఆ తిన్నవాడికి ఆ ప్రక్కనున్నవాడితో, వాడు మిత్రుడయినా, సరే ఆ కాసేపూ పోట్లాడాలని అనిపించవచ్చు. చేతనయితే ఏ విష్ణుసహస్రనామమో, లలితా సహస్రనామమో గానం చేస్తూ వంట చేయండి. మహనీయల గూర్చి ముచ్చటిస్తూ వంట చేయండి. ఏ భాగవతంలోని పద్యాలో పాడుకుంటూ వంట చేయండి. అప్పుడా

ఆహారాన్ని స్వీకరించినవారు కూడా ధన్యులవుతారు. ఒకటి గుర్తించండి. మీ ఇంటిలో పరిస్థితులెలా ఉంటాయన్నది మీ ఇంటిలో వంట జరిగే తీరును బట్టి ఆధారపడి ఉంటాయని గుర్తించండి. ఈ అంశాలన్నీ దృష్టిలో పెట్టుకొని మన పెద్దలు ఒకే ఒక మాట చెప్పి ఊరుకున్నారు. "చేసిన వంటను నైవేద్యం" పెట్టాలి అని.



## నైవేద్య విశేషం

దేవునికి నైవేద్యం పెట్టాలి అంటే మనం శుచిగా వంట చేస్తాం. శ్రద్ధగా వంట చేస్తాం. దేవుని స్మరణతో వంట చేస్తాం. ఆ వండిన వంటను దేవునికి నివేదన చేసి, అందరికీ ప్రసాదంగా వడ్డిస్తాం. ఎప్పుడయితే అది ప్రసాదమయిందో ఆహారంపైన ఆరాధనా భావం కలుగుతుంది. మామూలుగా కలిగే వ్యామోహం అప్పుడు కలగదు. 'ఇది బందరులడ్డు' అని చేతికిచ్చినపుడు గుటుక్కున నోట్లో పెట్టుకుంటాం 'మరొకటి ఉన్నదా?' అన్నట్లు చూస్తాం. 'ఇది తిరుపతి లడ్డు' అని చేతికిచ్చినపుడు కళ్ళకద్దుకొని నెమ్మదిగా తింటాం. 'అందరికీ ఇచ్చారా?' అన్నట్లు చూస్తాం. తేడాను గమనించండి. 'ఇది దేవునికి సంబంధించినది' అనేటప్పటికీ మనలో వస్తున్న ఎదుగుదలను గమనించండి. అందుకూ నైవేద్యం పెట్టమన్నది. గ్రహించండి.

## వంటశాలలో రమణుడు

రమణమహర్షి రెండు ప్రధాన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండేవాడు. వచ్చిన వాళ్లతో గడపడం వంటశాలలో గడపడం – అనేవి ఆ రెండు కార్యక్రమాలు. ఇంకా చెప్పాలీ అంటే వంటశాలలో గడపడానికే ఆయన ఎక్కువ ఇష్టపడేవాడు. ఇడ్లీ పప్పు రుబ్బేవాడు. పులుసుకు ముక్కలు తరిగేవాడు. రుచికరమయిన వంటలను తయారుచేసేవాడు. వాటిని అక్కడ చేరిన వారికి ప్రేమగా అందించేవాడు. ఒకరడిగారు. "ఎందుకండీ మీరు ఈ వంటపనిలో అదే పనిగా కలుగచేసుకుంటారు మీకేమీ పనులు లేనట్లుగా అని! ఆయనన్నాడు కదా, 'నేను మంచి మాటలు చెబుతున్నపుడు అందరూ ఒకే ఆర్తితో వినకపోవచ్చు. అదే నేను మంచి ఆహారాన్ని అందించినపుడు అందరూ ఆకలితో 'ఆవురావురు'మంటూ ఆకాంక్షతో స్వీకరిస్తారు. దీనిని బట్టి ఏం తెలుస్తుంది? మాటల కన్నా వంటలే ఎక్కువ ఆర్తితో స్వీకరింపబడుతున్నాయని. ఇది గమనించిన నేను నా ప్రేమనూ, నా స్పర్శనూ, నేనీయదలచిన ఆశీస్సును, నేను కలిగించ దలచిన ప్రచోదనాన్నీ ఈ ఆహార రూపంలోనే అందిస్తున్నాను. ఇలా అందించ గలగడం నాకూ ఎంతో తృప్తిగా ఉంది అని. విన్నారు కదా రమణమహర్షి మాటలు. వంట చేయడంలో ఎంతటి అవకాశం దాగి ఉన్నదో గమనించండి.



## 'ఇ.కె.' గారి వంట

ఇ.కె. మాస్టరుగారు వంటలో మంచి నిపుణులు. చారును ఆరు రకాలుగా పెట్టేవారాయన. ఆయనకు సరదా అనిపించినపుడల్లా 'మీరు కూర్చోండి' అని అందరినీ కూర్చోపెట్టి, తాను వంట చేసి పెట్టేవారు. వనభోజనాలు మొదలైనవి నిర్వహింపబడుతున్నపుడు వంట వారిలో ఒకరిగా నిలబడేవారు. విదేశీయాత్రలు సాగుతున్నపుడు ఆయా దేశవాసులకు మన దేశపు వంటకాలన్నీ తయారుచేసి, రుచి చూపించి, మురిపించేవారు.

## అందని ఆధునికులు

ఆధునిక యుగంలో ఎక్కువ మందికి వంట చేయడం మీద శ్రద్ధ తగ్గుతుంది. తప్పదు కాబట్టి చేస్తున్నారు. తప్పించుకునే మార్గమేమిటా అని ఆలోచిస్తున్నారు. దీనికి మాత్రం సెలవులేదు కదా అని బాధపడుతున్నారు. వంట చేయడంలో ఉన్న సరదా ఆ చేసి పెట్టడంలో ఉన్న దివ్యత్వం ఇంకా వారికి అందలేదన్న మాట. అందితే వారలా అనరు, అనలేరు!

### నిదర్శనాలు

ఇంకా ఆకలి ఉన్నది. మరికొంత తినగలను అన్న స్థితిలో ఉండగానే భోజనం చేయడం ముగించాలి. ఆకలి తీరేదాకా తినాలని అనుకోకూడదు. కడుపునిండా తినాలని కూడా అనుకోకూడదు. వీలున్నంతవరకు తినడం కాదు, శరీరానికి ఎంత కావాలో అంత తినడం చేతకావాలి. కొందరు పొట్టగా కనబడుతున్నదంతా జీర్ణకోశమేననుకొని అదేపనిగా పట్టిస్తూ ఉంటారు. గోనెసంచీలోనికి వస్తువులను త్రొక్కినట్లుగా త్రొక్కుతూ ఉంటారు. అది మంచి పద్ధతి కాదు. అభ్యాస దోషం వల్ల అలా తింటున్నాంగాని, నిజానికి అంత ఆహారం మనకు అవసరం లేదు. ఆహారాన్ని తగు మాత్రమే తీసుకుంటున్నాం అని తెలియడానికి మనకు కొన్ని నిదర్శనాలున్నాయి. అవి మనలో కనబడాలి. అప్పుడు మాత్రమే మనం తగు మాత్రం తీసుకుంటున్నట్లు విశ్వసించడానికి వీలవుతుంది. భోజనం చేయగానే మనకు మనంగా పైకి లేవగలగాలి. మరొకరి చేయూత మనకు అవసరం రాకూడదు. లేచినవాళ్ళం నడవగలగాలి. అవసరమయితే పరుగెత్తగలగాలి. భోజనం నుండి లేస్తున్నపుడు, నడుస్తున్నపుడు, పరుగెత్తుతున్నపుడు మనకు ఏ మాత్రం ఇబ్బంది కలగకూడదు. హాయిగా ఎప్పటిలాగానే ఉండగలగాలి. అట్లా గనుక ఉంటే మనం తగు మాత్రంగానే ఆహారం తీసుకుంటున్నట్లు లెక్క. భోజనం నుండి లేవగానే మామూలుగా పనిచేసుకోగలగాలి. పడుకోవాలని అనిపించకూడదు. అలా అనిపిస్తే మనం ఆహారమయినా ఎక్కువ తీసుకొని ఉండాలి లేదా ఏదైనా అనారోగ్యానికి

మనం గురి అవ్వడమయినా జరిగి ఉండాలి. అప్పుడు మాత్రమే అలా అనిపిస్తుంది.



భోజనం చేయగానే ఎవ్వరైనా నవ్విస్తే నవ్వగలగాలి. 'ఆగండర్రా! ఇప్పుడే అన్నం తిన్నాను' అని అనవలసిన అవసరం రాకూడదు. అలాంటి అవసరం వచ్చిందంటే మనం ఎక్కువ తిన్నామన్న మాట. భోజనం చేసిన తరువాత మనం ఎప్పటిలాగానే ఉండాలి. మనకు మనం బరువనిపించకూడదు. అలా అనిపిస్తే అది మనం ఎక్కువ తినడం వల్లనైనా అయి ఉండాలి, లేదా అనారోగ్యం వల్లనైనా అయిఉండాలి. పగటి భోజనం ఎక్కువైతే సాధారణంగా నిద్ర ముంచుకొస్తుంది. ఆ నిద్రలో ప్రాణశక్తి మనం చేసిన పని కోసం తాను తిప్పలు పడుతుంది. లేచేటప్పటికీ కొంత తేలికనిపిస్తుంది. రాత్రిపూట భోజనం ఎక్కువైతే నిద్రపట్టడం కష్టమవుతుంది. ఒకవేళ నిద్రపట్టినా పీడకలలు వచ్చే ప్రమాదముంది. ఎవరైనా మనని రాత్రిపూట భోజనానికి పిలుస్తున్నారూ అంటే జాగ్రత్తగా ఉండాలి సుమా! ఆహారాన్ని కనుక ఎక్కువగా తీసుకుంటే, ఆ ఎక్కువగా తీసుకోబడిన ఆహార భాగాన్నే తన శూలంగా స్వీకరించి ఉదరం లోపల నుండి పొడుస్తున్నాడని రుద్రనమకం చెబుతున్నది. అంటే ఎక్కువగా తీసుకోబడిన ఆహారమే మనిషిని వ్యాధిగ్రస్తుణ్ని చేస్తున్నదన్నమాట. "వ్యాధికి వేరే ప్రేరణ అక్కరలేదు. ఆహారాన్ని అధికంగా స్వీకరిస్తే చాలు" ఇది వేదవాక్కు.

**– శ్రీమోపిదేవి కృష్ణస్వామిగారు**

## మనం బాబాను ఏదైనా అడిగేటప్పుడు ఎలా అడగాలి?

**గురువుగారు :** మనం అడిగేది మనం అడుగుతుంటాం. దానికేమీ లేదు. అడగకూడదని ఆయనేమీ చెప్పలేదుగా! మనం ఎప్పుడడిగితే అప్పుడు, మనకు కావలసింది మనం అడుగుతాము... తప్పేమీ లేదు. మనం అడిగేదానికి మనకు క్లారిటీ ఉండాలి. బాబాకు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం లేదు. తీర్చడంలో కొంతమందికి క్లారిటీ ఇస్తారు. తీర్చకపోవడంలో కొంతమందికి క్లారిటీ ఇస్తారు. ఆయన ఇచ్చేటువంటి క్లారిటీ రకరకాలుగా ఉంటుంది. కాబట్టి ఇవన్నీ మనకొద్దు. ఆయన ఎట్లా చేస్తారు, ఆయన పంథా ఏమిటి, మనకొద్దు. మనకేం కావాలి? మనం ఎలా అడుగుతున్నాం? అంతే. దాన్ని తీర్చడంలోనే నీకు ఒక క్లారిటీ ఇస్తారు. తీర్చకపోవడంలో కూడా ఆయన క్లారిటీ ఇస్తున్నారు. అది రిసీవ్ చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. మనమేం చేస్తామంటే తీర్చినప్పుడూ స్పష్టత కోసం ప్రయత్నం చెయ్యము, తీర్చనప్పుడూ క్లారిటీ కోసం ప్రయత్నం చెయ్యము. తీర్చినప్పుడు, ఎందుకు తీర్చారు? ఎలా తీర్చారు? తీర్చినందువల్ల నేనేం చెయ్యాలి? అని ఆలోచించేటువంటి క్లారిటీ తెచ్చుకోవాలి. తీర్చకపోయినప్పుడు, ఎందుకు తీర్చడం లేదు? ఇన్ని తీర్చినవారు అదొక్కటి మాత్రం



ఎందుకు తీర్చడం లేదు నాకు? అది ఆయనకేమన్నా కష్టమా? ఏదో ఉంది. ఏమిటది? నేనేమన్నా నేర్చుకోవలసింది ఉందా? నేనేమన్నా చక్కదిద్దుకోవలసింది ఉందా? లేకపోతే అసలు నాకిది మంచిది కాదా? ఏంటి? అనేటువంటి క్లారిటీ తర్వాత నీకే వస్తుంది. మనలో సరైనటువంటి అవసరం ఉంటే, అదే అడగడం... సరైన అడగడం. ఆ అవసరాలకి, సరైనటువంటి రిక్వైర్మెంట్స్‌కి, మన అవగాహనకు అనుగుణంగా ఉండే కోరికలు అడగడం సరిగ్గా అడగడం లెక్క. అవి తీరుతాయి. ఇవి లేనప్పుడు అవి తీరవు. అవి మనం సరిగ్గా అడగలేదు. **“అడగడం నేర్పడం-సాయిపథం”** అని నేను వ్రాసిన దాంట్లో ఉద్దేశ్యం ఏమిటంటే, చక్కగా అడగడం అంటే **Sentence** సరిగ్గా **form** చెయ్యాలని కాదు. అడగడం నేర్పడం అంటే, ఏది అడగాలి? అడిగేటువంటి దానికే... మనలో ఆ అవగాహన, అవసరం, దాని యొక్క స్పష్టత మనకొస్తుంది. **What we need?** అనేటువంటి స్పష్టత. దానిని పెంచడం, అప్పుడు సరిగ్గా అడగటమూ వస్తుంది. అది సరిగ్గానూ తీరుతుంది. అది, **అడగడం నేర్పడం అంటే!**

**భక్తుడు :** మామూలుగా అవసరం కలుగుతుంది. దాన్ని మనం ఆటోమేటిక్‌గా... ఆ అవసరమే మనల్ని అడిగిస్తుంది. ఆ అవసరం అడుగుతాము, కోరిక తీరుస్తారు. అయితే దానిలోనూ... మరి, **“అడిగింది ఇచ్చుటే సాయిశపథం, అడగడం నేర్పుటే బాబాపథం”** అని ఉంది కదా సార్. అంటే ఇక్కడ నేర్పేది ఏమిటి సార్?

**గురువుగారు :** మనం అడుగుతాం గానీ కొన్ని నిజంగా క్లియర్‌గా అడగము. మనలోనే ఒక డైకోటమ్ ఉంటుంది. ఆ డైకోటమ్‌వల్ల ఏమిటంటే మనం అడుగుతాం, ఇప్పుడు ఉదాహరణకు, చిన్న ఉదాహరణ చెప్తాను. ఇప్పుడు ఇక్కడకు వచ్చారు. ఒక నాలుగు రోజులు గురువుగారి దగ్గర ఉంటే బాగుంటుంది అనిపిస్తుంది. కానీ అమెరికాకి పోతే బాగుంటుంది, అక్కడ జాబ్‌లో ఏమన్నా ఇబ్బంది వస్తుందేమో, ఏమన్నా ఇబ్బంది వచ్చిందంటే మళ్ళా ప్రాబ్లం కదా అనిపిస్తుంటుంది. అప్పుడు ఏమడుగుతారు? అడగడానికి బయటకు మాత్రం... ఇక్కడ ఏమీ ఇబ్బంది లేకుండా నాలుగు రోజులు ఉండేటట్లు చూడండి గురువుగారూ అని అడుగుతారు. కానీ నిజానికి లోపల ఏమీ ఉండదు అట్లా ఉండాలనే కోరిక ఉన్నా నిజంగా చెప్పాలంటే మాత్రం అక్కడికి పోవడమనేటువంటిది ఉంటుంది. అక్కడ ఉద్యోగం బాగుంటే మళ్ళా రావచ్చు. నాలుగు రోజులు ఉండొచ్చు. అది పోయిందంటే మళ్ళా కష్టం కదా అనిపిస్తుంది. అది ఒక డైకోటమీ **(dichotomy)**. దానివల్ల ఏమనిపిస్తుంది మనకు? ఇది పెద్దగా పట్టించుకోమైతే, నాలుగు రోజులు ఉండమని అడిగితే,



బాబా ఇవ్వకపోయినా కూడా ప్చ్ దాని దుంపతెగిందిలే అనుకుంటాం, ఇప్పుడు ఏమైందట. ఏం మునిగిపోయింది అని, కానీ పెద్ద విషయాలు ఏదైనా వచ్చినప్పుడు మాత్రం... ఆ... చూడు, బాబా నాకు ఇవ్వలేదు అని అంటాం. అడిగితే ఇవ్వకుండా పోవడం ఆయన పద్ధతి కాదు. అడిగేది సరిగ్గా అడగడం మనకే చేతకాదు. అది పోయేకొద్దీ, పోయేకొద్దీ మనలోనే ఒక క్లారిటీ పెరిగి, సరిగ్గా అడగటమూ వస్తుంది. ఎలా అడగాలో వస్తుంది. ఏమి అడగాలో వస్తుంది. అదిగానీ వచ్చిందంటే మనలో సెల్ఫ్ యాక్చువలైజేషన్ వస్తుంది లోపల, అప్పుడు జీవితంలో ఒక క్లారిటీ ఉంటుంది. ఒక ఆర్ట్ ఆఫ్ లైఫ్ ఉంటుంది. ఒక ఆర్ట్ ఆఫ్ లివింగ్ వస్తుంది. దానికి నెమ్మదిగా మనం ఏవాల్వ్ అవుతున్నాము. అడగడంలో రకరకాలుగా అడుగుతాం. ఒక రకంగా కాదు. నా దగ్గరకు వచ్చే వాళ్ళలో వంద రకాలుగా ఉంటారు. ఒక కోరిక ఉంది.... చూద్దాం, ఒక రాయేసి చూద్దాం. వంద మంది దేవుళ్ళలో ఒకటి. అయితే అవుతుంది. కాలేదనుకో నష్టమేమీ లేదు అనుకొని వచ్చేవాళ్ళూ కొంతమంది ఉంటారు. బాబాను అడిగి మళ్ళా వందమందిని అడిగే వాళ్ళూ ఉంటారు. తీరిందనుకో కోరిక, ఎవరు తీర్చినట్టు? అది అడగడం నేర్పడం అంటే, మీరు అడిగే వాటన్నింటిలో మీకు క్లారిటీ ఉందయ్యా?

**భక్తుడు :** లేదు.

**గురువుగారు :** ఎప్పుడూ ఒక ఛాయిస్ పెట్టుకొని అడుగుతారు. మాకు ఏది మంచిదో మాకు తెలియదు, అని ఒక మాట అంటారు. కానీ తెలియకపోయినా ఇదైతే బాగుంటుంది అని మాత్రం మనకనిపిస్తుంటుంది. నిజంగా తెలియకపోతే గమ్మున ఉండాలి కదా, ఉండటము మళ్ళా. నాకు తెలియదు కానీ... బాబా, అదైతే బాగుంటుంది.

**– శ్రీబాబూజీ**

## సంత్ రబియా "ప్రభు భక్తి"

సంత్ రబియా "ప్రభుభక్తి" అనే మార్గాన్ని అవలంబించి అతి నిరాడంబరతతో, సదాచారంతో, ఆత్మసంతోషంతో, ఆత్మ నిర్భరతతో జీవితాన్ని సార్థకం చేసుకుంది. పన్నెండు వందల సంవత్సరాల క్రితం ఈ సాధ్వి భగవంతుని పట్ల ప్రేమ మరియు స్వావలంబనకు ఆదర్శంగా ప్రపంచంలోని భక్తకోటి ముందు ఒక ఉదాహరణగా, నిరూపణగా నిలిచింది.

బస్రా అనే ఒక సాధు సంత్ రబియాను కలవడానికి తరచుగా వస్తూ ఉండేవాడు. ఒకరోజు ఆయన రబియా గుడిసె ముందు ఒక సంపన్నుడైన వ్యక్తి శోకతప్త హృదయంతో, కన్నీటితో ఉండటం చూసాడు. ఆ ధనవంతుని శోకానికి కారణం అడుగుతూ సంత్ బస్రా ఇలా అన్నాడు.



"అన్నా! రబియా నిన్ను ఏమన్నా అన్నదా? ఆమె సాధారణంగా ఎప్పుడూ ఎవరినీ నిందించదు. ఆమె యొక్క ఏ ప్రవర్తన మీకు బాధ కలిగించింది" అని. "ఆమె యొక్క ఒకే ఒక్క ప్రవర్తన నా హృదయానికి చాలా బాధ కలిగించింది" అని ఆ ధనవంతుడు చెప్పాడు. 'అదేంటి' అని సంత్ బస్రా అడిగాడు. ఈ ధనవంతుడు రబియా యొక్క విరోధి అయి ఉంటాడు. ఆమెను కలవడానికి వచ్చే జనాన్ని ఆమెకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి ఇక్కడ నిలబడి కన్నీళ్ళతో నాటకం ఆడుతున్నాడు అని అనుకున్నాడు. కానీ ఆయన అనుమానాన్ని పటాపంచలు చేస్తూ ఆ ధనవంతుడు ఇలా అన్నాడు. "సదాచారం మరియు సన్మార్గంలో ఎలా పయనించాలో సంత్ రబియాను చూసి మనం ప్రేరణ పొందుతాము. ఆ మార్గంలో అడుగు ముందుకు వేసే శక్తి కూడా కలుగుతుంది. ఈమె మాత్రం పేదరికంతో జీవితాన్ని గడపడం చూసి నాకు చాలా బాధ కలుగుతుంది. చిరిగి పీలికలయిన బట్టలు, ఇంటిలో తినడానికి సరిపోనంత అన్నము ఉండదు. ఒకవేళ ఎవరైనా తెచ్చి ఇచ్చినా కూడా ఆమె స్వీకరించదు. ఆమె యొక్క ఈ ధోరణి నాకు చాలా బాధ కలిగిస్తుంది. అనకూడదు కానీ ఇలాగే సరిపడినంత ఆహారము లేక ఆమె ఏదో ఒకరోజు చనిపోవచ్చు అనిపిస్తుంది. ఒకవేళ అదే జరిగితే మన నగరం కళావిహీనంగా మారిపోతుంది.

ధనవంతుని దగ్గర బంగారు నాణేలను నింపిన చిన్న సంచి కూడా ఉంది. దానిని అతడు. రబియాకు ఇవ్వాలనుకుంటున్నాడు. అందువలన బస్రా ఆ వ్యక్తిని వెంటబెట్టుకొని సంత్ రబియా దగ్గరకు వెళ్ళి ఆ ధనవంతుని మాటలను సమర్థిస్తూ ఇలా అన్నాడు. "ప్రియమైన చెల్లి! నువ్వు ఈ బంగారు నాణేలను స్వీకరించు. అసలు శరీరం ఉంటేనే కదా ఆ భగవంతుని యొక్క సత్యాన్ని శోధించగలవు. ఆ శరీరమే లేకపోతే ఏమీ చేయలేవు కదా!" అన్నాడు. దానికి రబీయా "అన్నా! పగలు రాత్రి దుష్కర్మలు చేస్తూ ఉన్నా కూడా ఆ భగవంతుడు వారి మంచిని చూస్తాడు. ఆ భగవంతుడు అలాంటి వారిని కూడా పట్టించుకొనేటప్పుడు నన్ను ఎలా మర్చిపోతాడు? చాలా కాలం నుండి ఆయన మార్గంలో పయనిస్తూ నేను నేర్చుకున్నది, "ఆ భగవంతుని కృపకు ప్రాప్తురాలవ్వడానికి సాధకుడు ప్రత్యేకంగా ఎవరి ఆశ్రయం లేక సంరక్షణ మరియు ఆసరా తీసుకోకూడదు"అని.

"భగవంతుడు నా అవసరాలను ఏదో రకంగా పూర్తి కావిస్తాడు. మీకు నా కుటీరంలో దైన్యం, దరిద్రం కనిపిస్తుందేమో కానీ నాకు దీనిలో ఆ భగవంతుని కృప అనుభవమవుతుంది. రబియా యొక్క ఈ సమాధానంతో సంత్ బస్రా సంతోషంతో ఉప్పొంగిపోయాడు.



ఇంకోసారి మరో ఘటన జరిగింది. రబియా యొక్క ఆరోగ్యం పాడయింది. మరలా ఆ ధనవంతుడు ఆమెకు పరిచర్యలు చేసి మంచి చికిత్స చేయించాలనే ప్రస్తావనతో వచ్చాడు. సంత్ రబియా భగవంతుని పై తనకు భరోసా, నమ్మకం ఉన్నాయని మళ్ళీ గట్టిగా చెప్పింది. అప్పుడు ఆ సజ్జనుడు "అయితే ఇప్పుడు ఆ భగవంతుని ఎందుకు ప్రార్థించవు? ఆయన మీ ప్రార్థన వినగానే తప్పకుండా మీ గురించి ఆలోచిస్తాడు." అప్పుడు రబియా "ఆయనకు తెలీదా నేను జబ్బుగా ఉన్నానని?" చిరునవ్వుతో అన్నది. "ఆయనకు నేను జబ్బుగా ఉన్నానని తెలిసి ఉంటే ఇది ఆయన **'అనుగ్రహమే'**గా! నా శరీరం ఈ జ్వరం యొక్క వేడిలో కాలి పవిత్రం అవ్వాలని ఆయన కోరిక అనుకుంటా, ఆయన కోరికకు విరుద్ధంగా ఆయనను ఈ రోగం తగ్గించమని ప్రార్థించడం భావ్యం కాదు. తగ్గించాలని అనిపిస్తే వెంటనే తగ్గిస్తాడు. నేను ఆయనను నా జబ్బు తగ్గించమని ఇటువంటి కోరిక కోరి ఆయన ప్రేమపూరిత చర్యను కళంకితం ఎలా చెయ్యను"? ధనవంతుడు సంత్ రబియా యొక్క మాటలను విని నిరుత్తరుడయ్యాడు. ఆయన వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోయాడు. **నిరాశ చెంది కాదు. భగవంతుని మీద అపారమైన విశ్వాసంతో మరియు పరమానందం అనే ప్రేరణా ప్రకాశాన్ని తీసుకొని వెళ్ళిపోయాడు.**

**– సేకరణ : యుగనిర్మాణ యోజన.**

## నాన్నగారి సమకాలీనమైన ఆధ్యాత్మికత

సమకాలీన ఆధ్యాత్మికతలో నాన్నగారు ఖచ్చితంగా ముందు వరుసలో ఉంటారు. ఆయన విధానంలో హేతుబద్ధమైన ఆలోచన, మార్మిక ప్రేమ (భక్తి) పొందికగా సమ్మిళితమయ్యాయి. ఆధ్యాత్మికతకు సమగ్రమైన ఓ నూతన దృక్పథాన్ని ఆవిష్కరించారు. సమగ్రం అంటే ఏమిటి? ఆధ్యాత్మికతకు పరిధులు పెట్టి దానిని ఒక భాగానికి పరిమితం చెయ్యలేము. ఆధ్యాత్మికత అనేది మన జీవితంలో కేవలం ఒక భాగం మాత్రమే కాదు. మన ఆలోచనా విధానానికి, మన జీవన విధానానికి మార్గనిర్దేశనం చేసే ఓ శక్తి. అందులో ప్రాపంచికం అని పిలువబడే భాగం కూడా ఉంది. మన ఆధ్యాత్మికత మన అస్తిత్వాన్ని మొత్తం స్పృశించి, మనలో పరివర్తన తీసుకువచ్చి, మన(లో) ఉనికిలో ప్రతిబింబించాలి. నాన్నగారి మార్గం గురించి ఆలోచించడం మొదలుపెడితే ఆ బాటలో సరికొత్తగా అనిపించే విషయాలు ఎన్నో కనిపిస్తాయి. ఆయన మార్గంలో అంధవిశ్వాసాలు లేదా తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలని అనుసరించడం ఉండదు. ఎవరికి వారు స్వంత మార్గాలను ఏర్పరచుకోవడం, ప్రశ్నించడానికి, అన్వేషించడానికి, సాధించడానికి ధైర్యం చేయడం



ఉంటుంది. **ఈ మార్గం పుణ్యాన్ని పోగు చేసుకోవడం కోసం కాదు. ఆనందాన్ని కూడబెట్టుకోవడం కోసం! యాంత్రికమైన పారాయణలు చేయడమో లేదా మంత్రాలను వల్లెవేయడం కాదు. ప్రాచీన ఆధునిక మహాత్ముల జీవితాలు, ఆధ్యాత్మిక గ్రంథాలలో సమాధానాల కోసం తీవ్రంగా అన్వేషించడం.**

ఎప్పటికీ అంతుచిక్కని బ్రహ్మాన్ని కనుగొనడం కాదు, మన స్వంత పరిపూర్ణత కోసం ప్రయత్నించడం. ఈ మార్గంలో **'దృష్టి'** వ్యర్థ మూఢనమ్మకాల నుండి భావోద్వేగపు సున్నితత్వాన్ని అర్థం చేసుకోవడం మీదకు మారుతుంది. రాబోయే జన్మల కోసం ఇపుడు ఏదో చేయడం కాదు, ఈ జన్మలో ఈ వర్తమాన జీవితాన్ని నిజంగా జీవించడానికి ప్రయత్నించడం. కేవలం ధార్మికమైన జీవితాన్ని గడపడం కాదు. అర్థవంతమైన జీవితాన్ని గడపడం! అనేక ఆధ్యాత్మిక సంప్రదాయాలలో కోరికలు ఎల్లప్పుడూ దుఃఖానికి మూలస్థంభాలుగా ఉన్నాయి. కానీ ఇపుడు నాన్నగారి మార్గంలో ఆ కోరికలే మన ఆనందానికి సోపానాలవుతాయి. దేన్నో వదిలిపెట్టడానికి ప్రయత్నించడం కాదు. మనం ప్రేమించే ఆ లక్ష్యాన్ని అంటిపెట్టుకోవడాన్ని నేర్చుకోవడం వైరాగ్యం కాదు, మన సద్గురువు పట్ల గాఢమైన అనురాగం కలిగి ఉండటం, నిర్లిప్తంగా, నిస్తేజంగా ఉండిపోవడం కాదు. ఉత్సాహంగా ఉండటం, సజీవంగా ఉండటం! మన శరీరాలను బలవంతంగా కఠినమైన భంగిమలతో శిక్షించడం కాదు. మన సద్గురు నామశబ్దానికి పారవశ్యంతో నృత్యం చేయడం, భక్తి పేరుతో ఏవో తంతులను మళ్ళీ మళ్ళీ చేయడం కాదు. ఇది మన ప్రేమను వ్యక్తీకరించడానికి కొత్త అర్థవంతమైన మార్గాలను కనుగొనడం. మన సంక్లిష్ట స్వభావాన్ని విశ్లేషించడం కాదు, ప్రేమ యొక్క భాషను మన స్వభావంలో ఇముడ్చుకోవడం. మన ఆలోచనలను బలవంతంగా నియంత్రించడం కాదు, వాటిని మనం ప్రేమించే లక్ష్యం (సద్గురువు) వైపు మళ్లించడం. మన భావోద్వేగాలను క్రమబద్ధీకరించడం కాదు, వాటిని ప్రేమ అనే ఓ గొప్ప భావోద్వేగానికి ఆజ్యం చేయడం! నాన్నగారు జీవితాన్ని సంపూర్ణంగా జీవించడం నేర్పిస్తారు. మరణభయంతో కాకుండా, అదొక అద్భుతమైన వరం అనే ఎరుకతో జీవించేటట్లు చేస్తారు. ఈ ప్రపంచం నుంచి ఎలా తప్పించుకోవాలో చెప్పరు, ఎలా జీవించాలి, ఎలా ప్రేమించాలి – మనం ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలో చెబుతారు. మన మానవ పరిమితులకు అతీతంగా పోవడం కాదు. నిజమైన మనిషిగా ఉండటం. మనిషిగా ఉండటంలో గల నిజమైన స్థాయిని అర్థం చేసుకోవడం దానిని సాధించడం. ఆయన తమ కాలానికంటే చాలా ముందున్నారు. ప్రస్తుతం ఉన్న ఆధ్యాత్మిక భావజాలానికి ఓ కొత్త దృక్పథాన్ని తీసుకొచ్చారు. **ఆయన మార్గం నూతనం,**



**విశిష్టం ఇంకా సమకాలీనం. ఆయన స్ఫూర్తిప్రదాయకం, అపూర్వం.** అంతేకాకుండా ఆయన ఈ కాలానికి చెందిన మన అవసరాలు తెలిసినవారు. మన జీవితావసరాలకు అనుగుణమైన రీతిలో, మనకు అర్థమయ్యే రీతిలో ఆయన ప్రతిస్పందించారు. ఆయనది ఓ అసాధారణమైన జీవితం! కాలగతిలో ఇలాంటి వారు అరుదు. గురువుగారు అనే ఆ గొప్ప అద్భుతాన్ని చూసే భాగ్యం కలిగినందుకు మనం ఎంతో అదృష్టవంతులం.

**– సాయినాథుని శృతి**

## 'గురుకృపే' తొలి అడుగు

ప్రతి మనిషికి "గురువు" అనే ఒక శక్తి స్వరూపం, సందేశం, సంబంధం అవసరం. అది ఒక చిత్రమైన ఋణానుబంధంతో మొదలవుతుంది. మనందరికీ తెలిసిన మహా మహితాత్ములు, నాకు ఆదిగురువు అయిన శ్రీభరద్వాజ మాస్టారుగారి అనుభవం – జీవిత సత్యం కూడా అదే. ఈ విషయం చదివిన తర్వాత అప్పట్లో నాలో ఉన్న డోలాయమాన పరిస్థితి నుండి బయటపడి "శరత్‌బాబుగారిని" ఒక వ్యక్తిగా కాక, "సద్గురు దేవులుగా" భావించుకుని ఒక స్థిరమైన నిర్ణయాన్ని తీసుకోగలిగాను. (అని మనం అనుకుంటాంగానీ గురువే మనల్ని పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కున్నట్లు మనల్ని తన దగ్గరకు లాక్కుంటారు). తదాదిగా దయతో వారి కృప నాపై అనేక విధాలుగా వర్తించింది. దానికి నిదర్శనం ఒక ముఖ్యఘట్టం.

నేను మొదటిసారిగా గురుదర్శనం కోసం 1997వ సంవత్సరంలో దసరా సంబరాలకి షిరిడీ వెళ్ళడం జరిగింది. మొట్టమొదటిసారిగా షిరిడీ సాయియానాలో గురూజీ దర్శనంతో ఎంతో అవ్యాజమైన అనుభూతిని, అనిర్వచనీయమైన ఆనందాన్ని చవిచూసాను. ఎన్ని రోజులు ఉన్నానో గుర్తులేదు (సుమారు పది రోజుల పైనే) అప్పటికి నాకు తెలిసిన గురుబంధువులు తెనాలి వారు మాత్రమే. పేరుకు దసరా సంబరాల మిషతో వచ్చినవారే. కానీ ఇక్కడికి వచ్చినవారు గురువుగారి దర్శనం చేసుకుని తమతమ బాధలు, సమస్యలు, కోరికలు ఇలా ప్రతి చిన్న విషయం పెద్ద విషయం వారికి విన్నవించుకుని వారి అనుగ్రహం, ఆశీస్సులు పొందడం కోసం వచ్చిన వారే అని నేను గ్రహించాను.

ఆ ప్రాంగణంలో కొత్తవారు, పాతవారు ఒకరిని ఒకరు గురుబంధువులుగా పరిచయం చేసుకొని పలకరించుకుంటూ, గురువుగారి గురించి, బాబా గురించి అనేక విషయాలు చర్చించుకుంటూ సాయిధ్యాసతో, సాయి ఊసులతో పండుగ వాతావరణం సంతరించుకోవడం నేను గమనించాను.



నాకు మరెక్కడా కనిపించని, నేను మరెక్కడా గమనించని పరస్పర సహాయ సహకార వాతావరణం అక్కడ కనిపించి, నన్ను ఎంతో ఎంతో మంత్రముగ్ధుణ్ణి చేసింది. దసరాకు ముందురోజు నుండే వచ్చిన ప్రతి సాయిభక్తునికి వసతి సౌకర్యం, భోజన సదుపాయములు ఇలా ప్రతి పనిలో వాలంటరీగా జరుగుతున్న సేవానిరతిని నేను గమనించాను. నేను కూడా తెనాలి నుండి వచ్చిన కృష్ణామాష్టారుగారి విద్యార్ధిబృందం, గురుబంధువులతో కలసి భోజన వడ్డన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఆఖరి రోజు అన్ని రోజులు అచ్చటి భక్తులు తిన్న పులిస్తరాకులను బయట పడవేసే కార్యక్రమంలో అందరం కలిసి పనిచేయడం జరిగింది. ఎంతో కుళ్ళి, దుర్వాసనతో ఉన్న వాటిని కూడా సాయిసేవగా భావించి ఇష్టంగా పూర్తి చేసాం.

వారిలో ఒక గురుబంధువు తన ఇద్దరి చిన్న పిల్లల్ని డయాస్ మీద గురువుగారి ఫొటోదగ్గర పడుకోబెట్టి ఎంతో శ్రద్ధగా ఆ సేవా కార్యక్రమంలో పాలుపంచుకోవడం నన్ను ఎంతో ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. షిరిడీలో గురు అనుగ్రహంతో బాబా ఆశీస్సులతో ఇంత గొప్పగా జరుగుతున్న సేవా నిరతి బయట ప్రపంచానికి తెలియచేస్తే బాగుంటుందన్న ఒక ఆలోచనకి అంకురార్పణగా ఆయా విషయాలతో ఒక బులెటిన్ ప్రచురిస్తే బాగుంటుంది కదా అని అనిపించింది. ఇంతటి మహోన్నతమైన సాయితత్త్వంతో మమేకమైన గురుబంధువుల సేవలు, గురువుగారి విశేషాలు షిరిడీలో గురువుగారిని దర్శించుకున్న వారికి మాత్రమే పరిమితం కావడం ఏమిటి? ఈ సమాచారం బయట వారందరికీ తెలిసేలాగా చేస్తే బాగుంటుంది కదా అనే ప్రేరణతో త్రైమాసిక పత్రికగా "గురుకృప" ఆవిర్భావం జరిగింది.

సచ్చరిత్ర విషయంలో జరిగిందే ఇక్కడ కూడా పునరావృతం అయింది. ఇదంతా గురు అనుగ్రహంతో ఆశీస్సులతో మాకు లభించిన ఆచరణే. మేము చేసాము, మేము చేస్తున్నాము అనుకోవడం కంటే "నా లీలలు సేకరించి పెట్టు, నా చరిత్ర నేనే వ్రాసుకుంటాను" అన్నట్టుగానే గురువుగారు గురుకృప ప్రచురణకు కావలసిన వనరులు అన్నీ విచిత్రంగా ముందుగానే ఏర్పాటుచేసారు.

ఎలాగంటే... నా పూర్వాశ్రమంలో నా వ్యక్తిగత హాబీగా కొంతమంది మిత్రులం కలసి కెమెరా క్లబ్ నిర్వహించే వాళ్ళం. ఆ క్లబ్ నిర్వహించే కార్యకలాపాలన్నింటితో ప్రతి సంవత్సరం ఒక సావనీరు ప్రింట్ చేయించేవాళ్ళం. ఆ పరిచయాలు, అనుభవాలు మా కాంప్లెక్స్‌లోని డిటిపి సెంటర్, నన్ను సాహిత్యపరంగా ముందుకు నడిపించే తెలుగుమాస్టారు శ్రీ పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తిగారి స్నేహం...



ఇవన్నీ గురుకృప పత్రిక రూపకల్పనలో ఉపయోగపడ్డాయి. ఇంత గొప్ప కార్యక్రమ నిర్వహణకు కావలసిన సౌకర్యాలన్నీ ఇలా ముందుగానే సిద్ధం చేసి ఉంచినది గురువుగారు కాక ఇంకెవరు! ఇలా ప్రారంభమైన గురుకృప పత్రిక గురుబంధువులు పొందిన అనుభవాలతో, లీలలతో ఒక పుస్తకంగా 25 వసంతాలుగా కొనసాగుతూ ఎందరినో అలరిస్తూ, మరెందరికో మార్గాన్ని చూపిస్తూ, తమ జీవితాలలో ఎదురైన సమస్యలకు పరిష్కారాలను చూపిస్తూ, బాబాగారి, గురుదేవుల ఆశీస్సులను ఎలా పొందాలో తెలియచేస్తూ ధన్యుల్ని చేస్తూ ఉండటంతో పత్రిక లక్ష్యం నెరవేరినట్లవుతోంది.

అతి వేగంగా ప్రపంచ గమనంలో ఈనాడు మనం చూస్తున్న టెక్నాలజీ మార్పు అనూహ్యంగా ఉన్నప్పటికీ, పెద్ద గ్రంథాన్ని సైతం చిన్న చిప్‌లో భద్రపరిచే వ్యవస్థలో పరుగులు పెడుతున్నప్పటికీ వాటి తాళపత్ర గ్రంథాలను నేటి తరానికి అందించిన ఘనత మాత్రం ప్రింటింగ్ రంగానిదే అని చెప్పక తప్పదు. అటువంటి ప్రింటింగ్ వ్యవస్థతో మనం గురుకృప ద్వారా అందిస్తున్న ప్రతి అక్షరం ముందు తరాలకు దిక్సూచి అవుతుంది అనడంలో సందేహం లేదు. సిద్ధ సంకల్పంతో, కర్తవ్యదీక్షతో గురుకృపతో ఇరువది ఐదు వసంతాలు నుండి కొనసాగుతున్న ఈ మానసపత్రిక ఇంకా ఎన్నో వసంతాలను జరుపుకునేలా చేయాలని బాబా-గురుజీల ఆశీస్సులను కోరుతూ....

*- గట్టా రత్తయ్య*

## గురువే హరి... సర్వులకూ దారి

**ధ్యానమూలం గురోర్మూర్తిః। పూజమూలం గురోః పదమ్ ॥**
**మంత్ర మూలం గురోర్వాక్యం। మోక్షమూలం గురోః కృపా ॥**

ఈ గురుగీతశ్లోకం అన్ని గురుగీత శ్లోకాలకన్నా నన్ను అమితంగా ఆకర్షించింది. ముక్తికి "గురుకృప" ఒక్కటే మార్గం అన్నది ఈ శ్లోక సారాంశం. ఆ గురుకృపను పొందాలంటే మనం మిగిలిన మూడింటిని ఆచరించాలి. ఎలా ఆచరించాలి అంటే. "నన్ను ఆనంద స్వరూపంగా ధ్యానించు, అది నీకు సాధ్యపడకపోతే నీ ముందున్న రూపాన్ని మనసులో నిలుపుకో" అన్నారు శ్రీసాయి. అంటే ధ్యానానికి మూలం గురువును బాహ్యంలోనూ, అంతరంగంలోనూ ధ్యానించడం. పూజకు మూలం గురుపాదాలు. పాదాలు చూపేది మార్గం. గురువు నడిచి చూపిన మార్గాన్ని తెలుసుకొని మనం కూడా ఆ మార్గాన నడవగలగాలి. మనం ఆరాధించే గురువు నడచిన మార్గం ఏమిటో తెలుసుకుందాం! గురువుగారికి సద్గురు దేవుడైన "శ్రీసాయిబాబా నోటి నుండి వచ్చిన ప్రతి మాటను ఆచరణాత్మకంగా ఆచరించడం



ఇష్టం". "నీవు సత్యాన్ని అంటిపెట్టుకో. నేనెప్పుడు నీ చెంతనే వుంటాను" అన్న శ్రీసాయి వాక్యానికి ప్రత్యక్ష దర్పణం గురువుగారి జీవితం. పరనింద పనికిరాదన్న శ్రీసాయినాథుని మాటను తు.చ. తప్పకుండా నిజ జీవితంలో ఆచరించడం. రెండవది–మనసా, వాచా, కర్మణా సద్గురువునే నమ్ముకుని ప్రతి విషయానికి సద్గురువుపై ఆధారపడి శరణాగతి పథంలో జీవించడం గురువుగారు చేసినది.

సద్గురువు చెప్పిన దానిని, ఆచరించి చూపిన దానిని శ్రద్ధా–భక్తులతో ఆచరించడమే నిజమైన పూజ. అందుకే **పూజకు మూలం గురుపథం.** సద్గురువు నడిచిన మార్గంలో నడవడం వలననే గురువుగారు సద్గురుస్థితిని పొందగలిగారు. మంత్ర మూలం గురువాక్కు. గురువు నోటి నుండి వచ్చిన ప్రతి మాటా మహావాక్యం. గురునామస్మరణ కన్నా గురువాక్యం ఆచరించడమే మంత్ర మూలం అయ్యింది ఎలాగో చూద్దాం. గురువుగారిని గురుదేవులుగా స్వీకరించి వారి నోటి నుండి వచ్చిన వాక్యాలను నేను ఎలా ఆచరిస్తున్నానో మీకు తెలుపుతాను.

గురువుగారు పరిచయం కాకముందు సాయిబాబాను ఆరాధించడం అంటే రోజు చరిత్ర పారాయణ చేసుకోవడం, నాలుగు హారతులు ఇచ్చుకోడం, గురువారం సాయిబాబా మందిరానికి వెళ్ళడం, గురువారం రాత్రి ఉపవాసం వుండటం చేస్తుండేవాడిని. గురుదేవులు నేను చేస్తున్న తంతుని చూసి, **"మనలో గుణదోషాలను పోగొట్టుకోకుండా మనం ఏ సాధన చేసినా ఫలించదు"** అన్నారు. అది వారినోటినుండి వచ్చిన మొదటి ఉపదేశవాక్యం. రెండవది అన్ని అనర్థాలకు బుద్ధే కారణం. ఆ బుద్ధిని సరైన మార్గంలో నడుపమని సాయిబాబాను వేడుకోవడం.

సాయిబాబా అంటే ఎందుకు ఇష్టం అని అడిగారు. నా చిన్నప్పటి నుండి నాకు కలిగిన అనుభవాలన్నంటిని చెప్పాను. మీకు ఎందుకు ఇష్టం అని గురువుగారిని అడిగాను నేను. దానికి గురువుగారు "మనిషిగా పుట్టి, సాటి మనిషికి **Maximum** ఉపయోగపడటమే బాబా చరిత్ర, జీవితం, జీవనం. వారు జీవించిన దానిలో 1/100 వంతు జీవించగలిగినా నా జన్మధన్యం", అని బాబాలో ఉన్న మానవత్వానికి పెద్ద పీట వేసారు. ఆ క్షణం నుండి బాబా పట్ల నా దృక్పథం పూర్తిగా మారిపోయి సాయిచరిత్రను ఆ కోణంలో చదవడం మొదలుపెట్టాను. బాబాసూక్తులతో ప్రధానమైనది "పని చెయ్యి, సద్గ్రంథాలు చదువు, దేవుని నామం ఉచ్చరించు" అన్న బాబా మాటను గురువుగారు ఆచరిస్తూ నా చేత ఆచరింపచేసేవారు. గురువు మన శ్రేయస్సు కోసం చెప్పిన ప్రతి మాటను, వేదవాక్కులా పట్టుకొని నడవడమే "మంత్రమూలం", గురోర్వాక్యం అన్న అనుభవం

నాకు కలిగింది.  సద్గురువు మన లోపల, బయట వికసించటం, సద్గురువు చూపిన మార్గాన నడవడం, మనం గురువాక్యాన్ని ఆచరించగలిగితే "గురుకృప"తో ముక్తి లభిస్తుందని అర్థమై పై విషయాలను ఆచరించడానికి శ్రద్ధాభక్తులను ప్రసాదించమని శ్రీసాయినాథుని, గురువులను ప్రార్థిస్తున్నాను. **– డా॥ బి. శ్రీనివాసుల రెడ్డి**



## గురుకృపాలహరి

హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు, సంశయము పని లేదా హరిమయము గాని ద్రవ్యము, పరమాణవు లేదు వంశపావన! వింటే, శుకమహర్షి పరమపావనుడైన పరీక్షన్మహరాజుకు చెపుతూ ఇలా అన్నాడు. రాజా! విశ్వమంతా విష్ణుమయం. విష్ణువు విశ్వమయుడు. ఇందులో సందేహం లేదు. విష్ణుమయం కాని పదార్థం ఈ ప్రపంచంలో ఒక్క పరమాణవు కూడా లేదు. భాగవతం రెండవ స్కంధంలోని ఈ మాటలకు సజీవ వ్యాఖ్యానాలు. మహాత్ముల జీవితాలు. చెంతకు చేరే ప్రతీ జీవిని భగవన్మయంగా, భగవంతునిగా, జరిగే ప్రతీ సంఘటనను భగవన్మయంగా దర్శించడం, ఏ స్థితిలోనైనా భగవంతుడినే ప్రార్థించడం, ఎంతటి ఉపద్రవమైనా (మన భావనలో) సకారాత్మకంగానే ఆలోచించడం, అలా జీవించడం వారికే సాధ్యం అలా ఆ'చరించి' చూపారు కనుకనే 'ఆచార్య' వరిష్ఠులుగా సర్వమానవళిచే ప్రస్తుతించబడి నమస్సులందుకున్నారు. భగవంతునిచే పరిణామంలో ఎన్నో జీవులుగా సృజింపబడి – 'బుద్ధి' కలిగిన మానవునిగా జన్మించి 'సిద్ధి'ని పొందలేని క్రమంలో 'హరి' 'గురువై' ప్రభవించిన వేళ, మన జీవితంలో వారిని అనుగమించిన వేళ నిజమైన 'ఉగాది', 'నవ'విధ భక్తులతో ఆ గురువును అనన్య శరణాగతితో సేవించిన వేళ గురువు మనకు వరమిస్తే (వరిస్తే) అది నిజమైన కళ్యాణం (శ్రీరామనవమి). గురువు హృదయ మందిరంలో సింహాసన పరివేష్ఠితుడైన వేళ సద్గురు'రాము'నికి పట్టాభిషేక మహోత్సవం. ఒక్కసారి 'గురువు' హృదయంలో నిలిస్తే శ్రీకృష్ణ జోగేశ్వర్ భీష్మ రచించిన ఆరతి గీతంలో వలె ''గురోవినతిమి కరీ హృదయమందిరీయాబసా! సమస్త జగ్‌హే గురుస్వరూప చీఠసో మానసా! ఘడోసతత సత్కృతీమతిహి దేజగత్పావనా! సమర్థ గురు సాయినాథ్ పురవీ మనోవాసనా!" "ఓ సద్గురూ! నా హృదయమందిరంలో నిలిచి ఈ సమస్త జగత్తంతా సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కల్యాణ కార్యాలు చేయాలనే సద్బుద్ధిని ప్రసాదించు" అని వేడుకున్నట్లు మనం కూడా జగత్తునంతా సద్గురు స్వరూపంగా దర్శించుకుంటూ కేవలం మానవ కల్యాణాన్నే కోరుకుంటాం. అదే నిత్య కల్యాణం –



పచ్చ తోరణం అంటే. ఆ కల్యాణమే వారి ఆకృతి (రూపం) కనుక ప్రతీ మహాత్ముని సన్నిధానమూ నిత్య హరిత శోభతో అలరారుతుంటుంది అది వారి ప్రకృతి (గుణము) కనుక. ఈ సృష్టి మొత్తాన్ని దైవంతో ఆచ్ఛాదించి చూడమంటుంది ఈశావాస్యోపనిషత్తు. అదే మహాత్ముల బాట. లోకకల్యాణమే తమ అభిమతంగా సాగిన వారి జీవితాలు మానవజాతికి నిత్య పాఠ్యాంశాలు. మనిషిని మనిషిగా చూసే గుణం మృగ్యమైపోతున్న రోజుల్లో పరమాచార్యస్వామివారి జీవితము, గురుదేవులు శ్రీబాబూజీ జీవితమును అధ్యయనం చేస్తూ ఎంతో కొంత ఆ మానవతా సౌరభాలు మనలోనూ గుబాళిస్తాయనడం అతిశయోక్తి కాదు. కంచి స్వామి వారి 'కథ'లోనికి వెళ్ళి ఆ మానవతా విలువల వనాలలో విహరిద్దాం పదండి. ఆ పదముద్రలను పరికిస్తే కఠిన పాషాణాలైన మనసులు కమనీయ శిలలుగా రూపుదాల్చవలసిందే!

ఎందుకు స్వామి వారి యాత్ర విశేషాలు మరియు ఇన్ని పౌర సత్కారాలు మనం అధ్యయనం చేసుకుంటున్నాం. ఎందుకు వారిని సర్వశ్రేష్ఠులుగా, సాక్షాత్తూ శంకరునిగా కొలుస్తున్నారు. ఆచరణ. అంతే. ఇదిగో ఒక చిన్న సంఘటన. స్వామివారు విజయయాత్ర (పాదాచారిగా) చేస్తున్న కాలంలో ఒకానొక పల్లెటూరు. తీవ్రమైన ఎండాకాలం త్రాగునీరు సేకరించి దాచుకోవడం చాలా ఇబ్బందిగా ఉంది. రెండు మైళ్ళు నడిస్తే కానీ స్వామి వారి స్నానానికి, అనుష్ఠానానికి నీరు లభించడం లేదు. సహాయకులకు కేవలం ఒక బకెట్టు మాత్రమే ఇస్తున్నారు. భవంతిలో శ్రీమఠం మకాం – ఎప్పటిలాగే స్వామివారు ఒక చెట్టు క్రింద. స్వామివారు ఆ చెట్టు క్రిందనే అనుష్ఠానం చేసుకుంటున్నారు. ఒక భిక్ష చేసుకునే అతడు తన పిల్లలతో ప్రతి ఇంటికి వెళ్తూ తాము కోరుకున్నది దొరక్క నిరాశతో వెనుతిరుగుతున్నారు. సేవకులు ఇదంతా గమనిస్తున్నారు. అవసరంలో ఉన్న వాళ్ళకి అంత మాత్రం ధాన్యం ఇవ్వలేరా! ఈ గ్రామస్థులు. కాదు కాదు వెండినైనా దానమివ్వగలరు గానీ వాళ్ళు అడుగుతున్నది మంచినీరు. త్రాగునీరు. తమకే కడవ మంచినీరు దొరకడం కష్టమైపోతే ఇక ఇతరులకా? అందునా భిక్ష చేసుకొనే కుటుంబానికి ఇవ్వకపోతే ఎవరు మాత్రం అడుగుతారు. జరిగేదంతా గమనిస్తున్నారు స్వామి. స్వామి వారు ఒక సేవకుణ్ణి పంపి ఆ కుటుంబాన్ని పిలుచుకు రమ్మన్నారు. తమ అనుష్ఠానం కోసం నిలవ ఉంచిన మొత్తం నీటిని వాళ్లకు ఇచ్చేయమని ఆజ్ఞాపించారు. ఆ కుటుంబం మొత్తం చేతులు దోసిలి పట్టి కడుపు నిండుగా నీరు త్రాగేదాకా స్వామి వారు అలా చూస్తూ నిలబడిపోయారు. ఇక ఒక చుక్క కూడా తాగలేము అన్నంతగా అందరూ ఆ నీళ్ళను త్రాగి సంతోషంగా అక్కడి నుండి వెళ్ళారు.

“నిజమైన మాధవుడెవరో తెలిసాక చేసే మానవసేవ మాధవసేవే అవుతుంది” అంటారు శ్రీబాబూజీ. మాధవుడెవరో తెలిసిన మానవతా మూర్తి, నడయాడిన దైవం పరమాచార్యస్వామి. ఒక్క ముక్కలో చెప్పాలంటే “దైవం – దైవాన్ని దర్శించుకోవడమే” కదా ఈ సంఘటన.



క్రితం సంచికలో స్వామి వారి మద్రాసు ఆగమనం గురించి ప్రస్తుతించుకున్నాం. అలా సుమారు 25 సంవత్సరాల తర్వాత చెన్నై వచ్చిన స్వామి వారు 540 రోజులు చెన్నై నగరవాసులను తమ అనుగ్రహ దృక్కులలోనూ – అనుగ్రహభాషణాలలోనూ తడిపి ముద్ద చేసారు. జయేంద్రసర్వతీ స్వామి వారిని విజయ యాత్ర చేయమని స్వామివారు సూచిస్తే – గురుచరణాల చెంతనే తాను ఉండిపోతానని వేడుకున్నారు. వేంచేసిన మొదట్లో జరిగిన చాతుర్మాస్య దీక్ష సంస్కృత కళాశాలలో జరిగితే అక్కడి ప్రాంగణంలో జరిగిన అనుగ్రహభాషణాలు ఆనంద జీవనానికి మేలుకొలుపులయ్యాయి. వీడ్కోలు సభలో రాజాజీ వంటి ప్రముఖులతో సహా ఎందరో మేధావులు స్వామివారికి వందన సమర్పణ గావించారు. నగర హడావిడికి దూరంగా వనగారంలో జరిగింది 1959 సం॥ చాతుర్మాస్యవ్రతం. తమ శిష్యుని అధ్యయనానికి, ధ్యానానికి ఇబ్బంది కలుగకుండా చిన్న కుటీరాన్ని ఏర్పాటు చేయించారు పెద్దస్వామి. నజరత్ పేటలో పది ఎకరాల ప్రాంగణంగా రూపుదిద్దుకున్న సంస్కృత విద్యా సమితిని ఆచార్యస్వాములు ప్రారంభించారు. దక్షిణాపథాన్ని సంస్కృత భాషకు పెట్టని కోటగా అభివర్ణించారు స్వామి.

జూన్ 7వ తేదీ 1958 వ సం॥ స్వామి వారు మద్రాసు మ్యూజియాన్ని సందర్శించారు. వారికి అక్కడి అధికారులు పూర్ణకుంభ స్వాగతాన్ని పలికారు. దక్షిణ భారత చరిత్రను దర్శింప చేసే విధంగా, క్రమానుగతంగా ఏర్పరచిన శిల్ప సందపను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నో విషయాలను అడిగి తెలుసుకున్నారు స్వామి. తంజావూరు జిల్లాలో లభించిన త్రిపురాంతక, త్రిపురసుందరీ విగ్రహాలను గురించి, బళ్ళారి జిల్లాలో లభించిన ఆలయ ద్వారబంధాలు ఎంతో క్లిష్టంగానూ, మనోహరంగానూ మలచిన ప్రాచీన శిల్పుల ఓపికను, నైపుణ్యతను శ్లాఘించారు స్వామి. హోయసల కాలం నాటి అంబిక విగ్రహాన్ని లండన్‌లోని రాయల్ అకాడమి వారు ఆర్ట్ ఎగ్జిబిషన్ కోసం తీసుకుని మరల భారతదేశం చేర్చారు. ఆ శిల్పాన్ని స్వామి వారు తమ హస్త స్పర్శతో అనుభూతి చెందారు. ఆ తల్లి కిరీటంలోని పూలను కూడా ఎంతో హృద్యంగా మలచిన ఆ శిల్ప కళా చాతుర్యాన్ని మెచ్చుకున్నారు. గుంటూరు జిల్లా భట్టిప్రోలులో బౌద్ధ ఆరామలలో లభించిన స్ఫటిక అవశేషాలు ఎంతో ఆసక్తిని



కలిగించాయి. అవి క్రీస్తు పూర్వం 200వ సం॥ నాటివి. అవి భారతీయుల నైపుణ్యాన్ని, పవిత్రతను గుర్తు చేస్తున్నాయని, పాండ్య, చోళుల కాలం నుండి లభించిన ఎన్నో పురాతన శిల్ప, చారిత్రక సంపదను, వెలకట్టలేని అమూల్య వారసత్వ సంపదను కంటికి రెప్పలా పరిరక్షిస్తున్న పరిశోధకులను, అధికారులను వారి శ్రమను ఎంతగానో మెచ్చుకుని వారిని అనుగ్రహించి, ఆశీర్వదించారు స్వామి వారు.

మార్చి 16వ తేదీ, 1959వ సం॥ స్వామి వారు మద్రాసు నుండి కాంచీపురానికి చేరే క్రమంలో మైలాపూర్ నుండి నుంగంబాక్కం చేరుకున్నారు. ఆ రోజు సాయంత్రమే సంస్కృత కళాశాల ప్రాంగణమంతా పిన్నలు, పెద్దలు, మహిళలతో నిండిపోయింది. వారి చరణకమల దర్శనం చేసుకొని, వారి ఆశీర్వచనాన్ని, మంత్రాక్షతలను గైకొని పరవశించారు భక్తజనులు. రాత్రి ఎనిమిది గంటల సమయానికి జనసంద్రమయ్యింది మైలాపూర్.

వారి మొదటి అడుగుతోనే "నమః పార్వతీ పతయే హరహర మహాదేవ" అంటూ శంకర నామాలతో యాత్రగా సాగి మద్రాసు పురవీధులను పావనం చేసారు స్వామి. అర్ధరాత్రి సమయానికి స్వామి నుంగంబాక్కం చేరారు. ఆ రోజు జరిగిన వీడ్కోలు సభ ఎందరికో గుర్తుండి పోయింది. 540 రోజులు పుర ప్రజల మనసులలో 'భక్తి'ని సుప్రతిష్టం చేసి ధర్మ మార్గాన్ని, సద్ధర్మాచరణ ద్వారా ఆనంద జీవనాన్ని ఎలా పొందాలో ఆచరణాత్మకంగా దర్శింపచేసి తమ విజయ యాత్రను కొనసాగించబోతున్న ఆ పరమహంస పరివ్రాజకుని పదాలకు అక్షరకుసుమాలను సమర్పించుకున్నారు తొమ్మిది భారతీయ భాషలలో. వేలాదిగా తరలివచ్చిన భక్తజనుల దర్శనార్థం ఒక ఎత్తైన వేదిక నలంకరించారు స్వామి. వారి వెనుకనే జయేంద్రస్వామి. నాలుగు గంటలు సాగిన ఆ వీడ్కోలు సభలో పూర్తి నిశ్శబ్దంతో వక్తల కృతి సమర్పణను అవధరించారు భక్తజనులు.

పరమాచార్యస్వామివారి విడిది క్రమంలో పొందిన వాత్సల్యాన్ని ఎనలేని వారి ప్రేమను, కరుణను తలచుకుని పరవశించారు. వారి సాన్నిధ్యంలో మారని మనసు లేదని, చాతుర్మాస్య క్రమంలో బ్రహ్మసూత్ర భాష్య అధ్యయనం జరిగే క్రమంలో ఆదిశంకరులనే దర్శించిన భావన కలిగిందని, అహింస, శాంతి, ధర్మానుష్ఠాము, ఆత్మజ్ఞానములను వర్షించిన వారి అనుగ్రహభాషణాలు ఎప్పటికి గుర్తుండిపోతాయని నమస్సులర్పించారు శ్రీబాలకృష్ణ అయ్యర్. అగ్నిహోత్రం రామానుజులు– స్వామివారిని అవతార పురుషునిగా అభివర్ణించారు. వేద, ధర్మశాస్త్ర పరిపాలనార్థం వారు చేపట్టిన కార్యక్రమాలు భగవత్ కృపా విశేషంగా తెలియ చెప్పారు. కన్యాదాన ట్రస్ట్ ద్వారా పేద కుటుంబాల

ఆడబిడ్డల వివాహానికి, మగపిల్లల ఉపనయనానికి జరుగుతున్న సాయాన్ని అనంతరామ దీక్షితులు కొనియాడారు. ఐదువేల సంవత్సరాల చరిత్ర కలిగిన హిందూధర్మం గత ఐదు వందల రోజుల్లో కళ్లకు కట్టినట్లు కనపడిందని, గీతాచార్యుని స్థితప్రజ్ఞత స్వామివారి ద్వారా వ్యక్తమయి భగవంతుని దర్శనమే అయ్యిందని, పాశ్చాత్యులు కూడా స్వామివారి మద్రాసు రాకను ఉపయోగ పెట్టుకునే భాగ్యం కలిగిందని ప్రణతులర్పించారు శ్రీమహాదేవన్.



భారతదేశానికి చివరి గవర్నర్ జనరల్‌గా, మద్రాసు ముఖ్యమంత్రిగా మన్ననలు గొన్న సి. రాజగోపాలాచారిగారు ఇలా ప్రసంగించారు. “మద్రాసు మహానగరంగానూ, ముఖ్యపట్టణంగానూ ఉండడము, ఇదే విధంగా అధర్మవర్తనానికి కూడా అవకాశము ఉండటము ఒకే సమయంలో జరుగుతోంది. ధర్మానికి గ్లాని కల్గిన ప్రతీసారి భగవంతుడు అవతార పురుషునిగా రూపుదాల్చి ధర్మ సంస్థాపన చేసి ఉద్ధరిస్తున్నది సత్యం. అట్టి అవతార పురుషులైన యతీంద్రులు పరమాచార్యస్వామి వారు మనందరి మధ్యలో ఉండటం మద్రాసు పుణ్యఫలం. వారు ‘జగద్గురు’వు కనుక అందరికీ చెందిన వారు. కనుక మద్రాసువాసులు వారి సద్భక్తి, సత్ప్రవర్తన ద్వారా వారి అనుగ్రహమునకు పాత్రులు కావలెను. వారి వంటి జగద్గురువుల జననమే భారతావనిని పుణ్యభూమిగా మలచింది. వారి వంటి పుణ్య పురుషులు, ఋషుల వాణియే సత్యమైన, శాశ్వతమైన, సనాతనమైన మార్గాన్ని చూపుతోంది ఎన్నో తరాలకు. ఈ రోజు దురాశలో మునిగిపోతున్న వారే నిజమైన పేదలు. ఆశించకూడని వస్తు సాంగత్యాలను పొందాలన్న దురాశ ఈనాడు కేవలం విద్యాధికులకే పరిమితం కాలేదు. మనం గ్రామీణలకు కూడా ఈ దురాశను అంటగట్టాము. మానవతా విలువలు ఎంతో త్వరితగతిన పతనమవుతున్నాయి. ఈ వ్యాధిని అరికట్టగల్గిన ఒకే ఒక వైద్యుడు భగవంతుడు. ఈ వ్యాధికి నిజమైన మందు ‘భక్తి’, ఎన్ని శాస్త్రాలను అధ్యయనం చేసినా సరే ఈ వ్యాధిని నివారించగల మందు ‘భక్తి’ మాత్రమే. అది కేవలం గురువు అనుగ్రహంతోనే సాధ్యం. ఇబ్బందులు కలిగితే ప్రభుత్వాలను అడగడమేగానీ, ధర్మమార్గంలో కర్తవ్య నిర్వహణను చేపట్టి భగవంతుని ప్రార్థించే గుణాన్ని మరచిపోతున్నాం. అలాంటి మనలో ‘భక్తి’ బీజాలను నాటి ఈ దేశాన్ని, దేశ ప్రజలను తమ అనుగ్రహాశీస్సులతో దీవించమని పూజ్య ఆచార్యస్వాముల పాదపద్మములకు ప్రణమిల్లి వేడుకుందాం” అని ముగించారు.

స్వామివారి పద స్పర్శతో మద్రాసు నగరం పవిత్రమయ్యిందని వారి సన్నిధి ఎందరిలోనూ



మార్పును తెచ్చిందని, కేవలం స్వామివారి వంటి మహాత్ములు ఈ పుణ్యభూమిలో నడయాడిన వేళ ప్రకృతి కూడా ఆశీర్వదిస్తున్నదని పంచుకున్నారు సోమసుందరతంబిరాన్. మహాత్ముల సన్నిధాన ప్రభావాన్ని విజ్ఞాన శాస్త్రం కూడా రూఢీ చేసిన తీరును, జీవిత గమనంలో ఎదురయ్యే ప్రతీదశలోనూ స్వామి వారి ప్రబోధం చూపే విశిష్ఠ మార్గమే ఆచరణీయమన్నారు ఆయన. స్వామివారికి కృతజ్ఞత తెలపడానికి ఏకైక మార్గం వారు చెప్పినది ఆచరించడమేనని విన్నవించారు భక్తజనులకు.

భక్తజనులందరితో పాటు ఈ విశేష కార్యక్రమాన్ని తిలకించి, ఉద్వేగముతో ఆలకించిన స్వామివారు ఇలా చెప్పారు. "మీ అందరి మాటలు ఎంతో ఉత్సాహంతోనూ, ఉద్వేగంతో కూడుకుని ఉన్నాయి. ఎన్నో మంచి విషయాలు పంచుకున్నారు. అయితే అందరి మాటల్లోనూ ఒకే ఒక్క లోపం ఉంది. అందరూ చెప్పిన విషయం "మీరు నేను చెప్పిన విషయాలను ఆచరిస్తేనే నాకు కృతజ్ఞతలు చెప్పినట్లు అని నిజానికి అది నాకు ఎంతో సంతోషాన్ని ఇవ్వాలి. మీరందరూ అలా వ్యక్తం చేసాక మిమ్మల్ని అలా అనవద్దని నివారించలేను. కానీ అలా మాత్రమే ఆలోచించవద్దని చెప్పగలను". ఇంకా వారి మాటల్లోనే వారు చూపిన మార్గమేమిటో రాబోయే సంచికలో గమనిద్దాం.

పరమాచార్యుల వంటి మహితాత్ములను తలుచుకోవడమే సద్గురు అనుగ్రహం. వారి వాణిని, వారి లీలలను గుర్తు చేసుకోవడం మార్పుకు శ్రీకారం. "మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నటికీ మారవు" అంటారు శ్రీబాబూజీ. మారని ఆ సూత్రాలను, ఆ మహితాత్ములిద్దరి ఏకరూప భావాలను దర్శించుకుందాం 'గురుకృపాలహరి'లో. సద్గురు చరణ ప్రాప్తిరస్తు... శుభం భవతు...

–గురుకృప

**"హ్యాపీగా ఉండండి. ఆనందంగా ఉండండి. నవ్వుతూ ఉండండి. తుళ్ళుతూ ఉండండి. బాబా ఇంత ఇచ్చినా ఆనందంగా ఉండండి. అంత తీసుకుని ఇంకా కావాలంటే అడుగుతూ ఉండండి. ఆనందంగా అడగండి. ఎన్నైనా అడగండి. ఎంతసేపైనా అడగండి. ఆనందంగా అడగండి. ఏడుస్తూ అడగకండి. అప్పుడు ఆనందజీవనం సాయిపథం. అడిగింది ఇవ్వడం ఆయన శపథం. అడగడం నేర్పడం సాయిపథం. రెండూ సమన్వయపడతాయి అప్పుడు. అడుగుతూ ఉంటాం. హ్యాపీగా అడుగుతుంటాం. అడిగింది ఇస్తుంటాడు. తినేస్తుంటాం. హ్యాపీగా ఉంటాం. మళ్ళీ అడుగుతూ ఉంటాం. బాబా యొక్క పథం *Happiness through Happiness* నడిచే మార్గమూ ఆనందమే. పొందేదీ ఆనందమే. గమ్యమూ ఆనందమే. ఎప్పుడో వచ్చేటువంటి ఆనందం వస్తుందో లేదో నాకు తెలియదు. ఇప్పుడు మాత్రం నాకు ఆనందం కావాలి. అందరూ హ్యాపీగా ఉండండి. మీరెంత హ్యాపీగా ఉంటే నేనంత హ్యాపీగా ఉంటాను సరేనా!"**

**– శ్రీబాబూజీ**



ఇక ఆ గోల్ అంటావా, ఆయన, బాబానే చెప్పారు. నువ్వు ఇలా ఉండు, నిన్ను చివరికంటా గమ్యం నేను చేరుస్తా అన్నారు. నువ్విలా ఉంటూ చివరికంటా గమ్యం చేరు అని చెప్పలేదాయన. "నేను చేరుస్తా" అన్నారు. మనకప్పుచెప్పింది ఏమిటి ఆయన? మార్గం గురించే కాబట్టి, **take care of the means. The end he will take care.** ఆయన చేసుకుంటారో, లేకపోతే మనకిక్కడే ఉంది ఎండ్. మనకు ఇదే ఎండ్. ఇంత చక్కగా ఉన్నాం మనం? ఎంత నిశ్చింతగా ఉన్నాం? ఎంత హ్యాపీగా ఉన్నాం? ఇందాక నేను చెప్పింది అదే. ఒక సెన్స్ ఆఫ్ సెక్యూరిటీతో, హ్యాపీనెస్‌తో, ఏడుపనేది దగ్గరకు రానివ్వకుండా, ఆనందంగా మనకుండేటువంటి హ్యాపీనెస్‌ని పదిమందికి పంచుతూ, ఆ పంచడంలో ఇంకా హ్యాపీనెస్ పొందుతూ, మనం ఉండగలిగితే చాలు, హ్యాపీగా ఉండండి.





సద్గురు మనోసంద్రంలోంచి ఎగసిపడే

అమృత భావకెరటాలు...

వారి లీలలు, వచనాలు, భాషణలు...

అవి ఆనందజీవనానికి పెన్నిధులైన

రసమయ రత్నపేటికలు...

సాయిప్రేమ అనే మధువును సుధామధురంగా

బిడ్డలకందించే మాతృత్వపు మధురిమలు..

సుజ్ఞాన తేజాలు... శరశ్చంద్రికలు...

gurukrupa.info | +91 83672 00045